# మిసిమి

మాస పత్రిక

అక్టోబర్ - 2002



లోక్ నాయక్ జయప్రకాశ్

శతజయంతి సంచిక

వెల రూ. 8/-



ఆలోచనామగ్నుడైన జయప్రకాశ్

# మిసిమి

**"All that we are is the product of what we have thought"**
**is "We are what we think." - Dammapada.**

సంపుటి 13 | అక్టోబరు 2002 | సంచిక 10

వ్యవస్థాపక సంపాదకుడు : **డాక్టర్ రవీంద్రనాథ్ ఆలపాటి**

## విషయ సూచిక


భారత రత్న జయప్రకాశ్ నారాయణ - సంపాదకుడు

ప్రజా హక్కుల పత్రం - లోక్‌నాయక్ శ్రీ జయప్రకాశ్ నారాయణ

సంపూర్ణ విప్లవం - లోక్‌నాయక్ శ్రీ జయప్రకాశ్ నారాయణ

ఉద్యమాలే ఊపిరిగా ఎదిగిన ప్రజల మనీషి జయప్రకాశ్ - ఎ.బి.కె. ప్రసాద్

ఆదర్శ నైతిక రాజకీయ జ్యోతి జె.పి. - శివలింగం

జె.పి. జీవిత లక్ష్యం - ప్రిజన్ డైరీ నుండి

వ్లాదిస్లా స్టానిస్లా రేమాంట్ విమర్శనావ్యాసం - బి.వి. రామిరెడ్డి

మనిషిపై అల్యూమినియం దాడి - సి.వి. సర్వేశ్వర శర్మ

స్వగతం నుండి స్వగతానికి - డా॥ యు. ఏ. నరసింహమూర్తి



విడిప్రతి రూ. 8/-    వార్షిక చందా రూ. 100/-    విదేశీయులకు $ 20

ముఖచిత్రం : **లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ**

Printed & Published by BAPANNA ALAPATI at Kala Jyothi Process Ltd.,
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyd - 20. Ph. 7645536
E-mail : misimieditor@rediffmail.com


సంపాదకుడు : **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**

# భారతరత్న జయప్రకాశ్ నారాయణ

జననం: **1902 అక్టోబరు 11** మరణం: **1979 అక్టోబరు 8**

ఆధునిక యుగం మనకు ప్రసాదించిన మహామహులలో జయప్రకాశ్ అగ్రగణ్యుడు. అంతేవాసి కోసం అంతా త్యాగం చేసిన త్యాగధనుడు. అతడి హృదయం నిర్మలం. అంతరంగం పారదర్శకం. అంతరాత్మపరిశుద్ధం. ఇటువంటి అంతరంగంలో పాదుకొన్న విలువలే ఆయన బాహ్య ప్రవర్తనలో ప్రతి ఫలించాయి. ఆంతరంగిక బహిరంగిక జీవితాలకు మధ్య ఎడం లేదు.

మనిషి జీవితంలో సిద్ధాంతాలు, విలువలూ - రెండూ ముఖ్యమైనవే. అయితే సిద్ధాంతాలు తరచు మారుతూ ఉంటాయి. అయితే జీవితానికి సంబంధించిన ప్రాథమిక విలువలు అంత తొందరగా మారవు - ఈ విలువలే ఆయనకు ప్రేరణ. ఏపని చేసినా ఆ ప్రేరణతోనే చేశాడు. ఆ విలువలు పారదర్శకత, మానవీయతలు ఇవే ఆయనకు ఊపిరి. అయితే ఆయన పైకి ఎంత ప్రశాంతంగా కనిపించినా, సత్యాన్వేషణ కోసం చివరివాని (అంతేవాసి) కోసం ఘూర్ణిల్లే అగ్ని పర్వతమాతడి అంతరంగం. ఈ ఆర్తితోనే అతడు సమాజాన్ని, రాజకీయాన్ని పునర్నిర్మించాలని ఆక్రోశించాడు. ఈ పునర్నిర్మాణంలో ఆస్తిపాస్తులు ఏ కొద్దిమంది చేతుల్లోనో పోగు పడవు. అందరికీ సమానంగా అందుతాయి.

ఆయన గాంధేయుడు. ఈ అర్థంలో అతడు విరాగి. తనకై ఏమీ కోరనివాడు. అతడు లౌకికవాది. మతాలను నిరాకరించలేదు. వాటి సౌమనస్యాన్ని కోరాడు. ఈ పురుషాధిక్య ప్రపంచంలో స్త్రీ విమోచనాన్ని కోరాడు.

అహింసాయుత ప్రజా ఉద్యమాన్ని నడిపాడు. దాని స్ఫూర్తిని ఇలా చెప్పవచ్చు.

చేతులు కట్టుకొని, స్థిర నేత్రాలతో
నిర్భీతితో, నిరాశ్చర్యంతో
వాళ్ళు దునుముతుంటే చూస్తూ ఉండండి
వారి కోపం చచ్చిపోయే దాక

ఆ తరవాత వాళ్ళు సిగ్గుతో తలవంచుకొని
వచ్చిన చోటుకు తిరిగి వెళ్తారు
ఈ విధంగా చిమ్మిన రక్తం మాటాడుతుంది

వారి అరుణిమ దాల్చిన బుగ్గలతో
పెను నిద్ర నుంచి కిశోరాలలా లేవండి
అజేయమైన సంఖ్యలో

విదిలించండి భూమి మీదకు
నిద్రలో మిమ్మాఛాదించిన తుషార రేణువులను.
మీరు ఎంతోమంది... వారు బహుకొద్దిమంది.

జయప్రకాశ్ సెంటిమెంట్స్ పెషెలీ వాక్యాలు - అర్థవంతంగా ప్రతిబింబిస్తాయి.

గాంధీలాగే జె.పి.గూడ ఒక 'ఉన్నత కారణం' కోసం తాను బాధ పడడంలోనే అర్థం ఉందని గ్రహించాడు.

''స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు నా జీవిత ఆశాదీపాలు. అవి నా జీవితాంతం అలాగే నిలచి ఉన్నాయి. కాలం గడిచే కొలది నాకు వాటి అర్థం మారిపోయింది. ఇప్పుడవి నాకు ఒక దేశానికి చెందిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కావు. మానవాళి మొత్తం స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు. మానవమూర్తి మత స్వేచ్ఛ, మనిషి మనస్సుకు సంబంధించిన స్వేచ్ఛ. ఆత్మ స్వేచ్ఛ నా జీవన రాగమైంది. నేను దానిని రొట్టెముక్క కోసం, భద్రత కోసం, అభివృద్ధి కోసం, లేదా రాజ్యవైభవం కోసం, మరో దాని కోసం వదులుకోలేను.''

\- ఎడిటర్

# ప్రజా హక్కుల పత్రం

- లోక్‌నాయక్ శ్రీ జయప్రకాశ్ నారాయణ

శ్రీ జయప్రకాశ్ నారాయణ నాయకత్వాన లక్షలాది ప్రజలు ప్రపంచ చరిత్రలోనే కనీవినీ ఎరుగనంతటి ప్రశాంతంగా 1975 మార్చి 6వ తేదీన ఢిల్లీలో ఒక మహాయాత్ర సాగించి లోక్‌సభ స్పీకర్‌కు ఒక కోర్కెల పత్రాన్ని సమర్పించారు. ఆయాత్ర బీహార్ ప్రజోద్యమానికి తమ హృదయ పూర్వక సహకారం ఉన్నదని తెలియ జేయటానికే సాగినా అప్పుడు సమర్పించిన కోర్కెల పత్రం దేశ ప్రజలందరికీ వర్తించేదిగా రూపొందించ బడ్డది. భారత ప్రజల తక్షణావసరాల కొరకు తీసుకోవలసిన చర్యలను, దేశ పరిపాలనలో చేయవలసిన మార్పులను, ప్రజా సేవారంగం అవినీతికి ఆలవాలమై ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదం జరుగుతుందేమో నన్నే భయం ఆవహించిన వాతావరణంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలనే ఆకాంక్షను ఆ మహా ప్రజాయాత్ర వ్యక్తం చేసింది.

ఆ నాడు శ్రీ జయప్రకాశ్ నారాయణ సమర్పించిన చరిత్రాత్మక పత్రం యిప్పటికీ ప్రజల హక్కుల పత్రంగానే ఉన్నదనే భావంతో దాన్ని తెలుగు ప్రజల ఉపయోగార్థం ప్రచురిస్తున్నాం.

భారత ప్రజలమైన మేము, సమస్త దేశ ప్రజల ఆకాంక్షలకు ప్రతీకగా రూపొందిన బీహార్ ప్రజా ఉద్యమానికి మా ఏకీభావాన్ని వ్యక్తీకరించడానికి ఇక్కడ సమావేశమయ్యాం. ప్రజా సేవా జీవన మౌలికనియమాలు, సురాజ్య మూల సూత్రాలు కాలరాచి వేయటానికి అంగీకరించబడుతున్నప్పుడు అందుకు తమ వ్యతిరేకతను తెలియజేయడం ప్రజల విధి. ప్రజాస్వామ్య పరిరక్షణకే మేము యాత్రసాగిస్తాం.

సమాజంలో సంపూర్ణ విప్లవానికి మేము దీక్ష వహిస్తున్నాం. అది గాంధేయ సిద్ధాంత పరిధిలో సాంఘిక, ఆర్థిక సమానత్వం, సిసలైన ప్రజాస్వామ్యం, నైతిక విలువలుగల ఒక నూతన ధర్మాన్ని సృజిస్తుంది.

ఈ ప్రాణప్రదమైన ధ్యేయాలను సాధించే దిశగా పురోగమించడానికి యీ క్రింది సత్వర కోర్కెలకై మేము డిమాండు చేస్తున్నాం.

బీహార్ శాసనసభ ఆ రాష్ట్ర ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది. ఆ శాసనసభ ప్రజలతో సంబంధం పెట్టుకోవడానికి భయపడుతున్నది. ముళ్ళతీగలతో, తుపాకులతో తనకుతానే భయంతో అడ్డుగోడలను కట్టుకుంటున్నది. చాల కాలంగా అది ప్రజా నాడీ స్పందనతో ప్రతిస్పందించటం మానివేసింది. ఆ రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న ప్రభుత్వానికి, ఆ రాష్ట్రప్రజల ప్రాణ ప్రదమైన హక్కులను కాలరాచిన ప్రభుత్వానికి అది కొమ్ముకాస్తున్నది.

దుష్పరిపాలనను ఆపకపోగా, ప్రభుత్వంలో నాగజెముడులా విస్తరించిన అవినీతిని ఆపకపోగా, బీహార్ శాసనసభ వీటిలో తనూ ఒక భాగస్వామి అయింది. ఇప్పుడు అక్రమాధికారాన్ని సాగిస్తున్న శాసనబద్ధ సర్వాధిపత్యాన్ని రద్దు చేయవలసిందిగా రాజకీయ సర్వాధిపతులైన ప్రజలు చాలకాలంగా కోరుతున్నారు.

గుజరాత్‌లో రాష్ట్ర ప్రభుత్వం పడగొట్టబడ్డది. ప్రజా ఉద్యమంతో దాదాపు ఒక ఏడాది క్రిందటనే శాసనసభ రద్దుచేయబడ్డది. కాని స్వేచ్ఛా యుతమైన ఎన్నికలు ఇప్పటికీ ప్రకటించబడవలసి వున్నది. కనుక బీహార్ ప్రభుత్వాన్ని తొలగించాలని, శాసనసభను రద్దు చేయాలని, త్వరలోనే బీహార్‌లోనూ, గుజరాత్ లోను కొత్తగా ఎన్నికలు జరపాలన్నది మా మొదటి కోర్కె.

## ప్రజల సాంఘిక ఆర్థిక హక్కులు

ప్రభుత్వ వినాశనాత్మక విధానాలు ఒకవైపు ఆర్థిక స్తబ్దతకు, మరొకవైపు దారిద్ర్య విస్తృతికి, పెరుగుతున్న ధరలకు, పెరిగి పోతున్న నిరుద్యోగానికి దారితీసినవి. అత్యవసర సరుకులు దొరక్క-పోవటమనేది బలహీన వర్గాల ప్రజల జీవితాలలో ఒక శాశ్వత సత్యమయింది. దాదాపు 60 శాతం జనాభా అర్ధకాటక పరిస్థితుల్లో నివసిస్తున్నారు. వారి సంఖ్య భయంకరంగా పెరిగిపోతున్నది. సాంఘిక అసమానత్వాలు అధికమవుతున్నాయి.

ప్రజలకు జీవగఱ్ఱ అయిన వారి సాంఘిక ఆర్థిక స్వత్వాలను తక్షణమే వారికి సమకూర్చాలి. అందుకు యీ క్రింద సూచించబడ్డ చర్యలు తీసుకోవాలని మేము కోరుతున్నాము.

1. బలహీన వర్గాలకు ప్రత్యేకంగా జనాభాలలో 60 శాతంగా వున్న పేదలకు, నిరుపేదలకు వారికి అందుబాటులో ఉండే ధరలకు ప్రాధమిక జీవితావసర వస్తువులు సమకూర్చే హామీ యివ్వాలి.
2. అత్యవసర వస్తువుల ధరలు వాటి ఉత్పత్తి విలువకు సంబంధం కలిగి ఉండాలి. వ్యవసాయ వస్తువుల, పారిశ్రామిక వస్తువుల ధరలు హేతుబద్ధమయిన పాళ్ళలో ఉండాలి, ధరలను స్థిరీక రించాలి. జాతీయాదాయాభివృద్ధి స్థాయికన్న ధరల పెరుగుదల మించకూడదు.
3. అవసరం ఆధారంగా గల కనీసవేతనాలకు, ఆదాయాలకు పూచీ అందరికీ యివ్వాలి.
4. ఆర్థిక అసమానత్వాలను 1 : 10 నిష్పత్తిలో హేతుబద్ధమైన పరిమితులకు తగ్గించాలి.
5. పటిష్టమైన భూస్వామ్య సంస్కరణలు చెయ్యాలి. అందుకు భూమిని న్యాయబద్ధంగా (equitable) తిరిగి పంచాలి. దున్నే వాడికే భూమి అన్న సూత్రానుసారం భూమిమీద స్వామ్యం కలిగించాలి. భూమిలేనివానికి అతడు నివాసముంటున్న భూమిపై హక్కు కలిగించాలి. వ్యవసాయ కార్మికునికి న్యాయమైన వేతనానికి హామీ ఉండాలి; అందులో ఎక్కువ భాగం వస్తురూపంలో చెల్లించాలి.
6. పూర్తి ఉద్యోగ కల్పనకు హామీ కలిగించాలి. ఈ సంకల్పాన్ని నెరవేర్చటానికి అనువైన సాంకేతిక పరిజ్ఞానానికి అగ్రప్రాధాన్యత యివ్వడంద్వారా వ్యవసాయాన్ని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను అభి వృద్ధి చెయ్యాలి. అదే విధంగా పారిశ్రామికీకరణ కార్యక్రమాలు మానవ శక్తిని పెద్ద ఎత్తున సమీకరించి, సాంకేతిక పద్ధతులలో స్కీములలో నిమగ్నం చేసే విధంగా ఉండాలి.
7. జాతీయ నిష్టాగరిష్ఠ, నిరాడంబర రాజ్యాన్ని ఏర్పాటు చెయ్యాలి. ఈ విషయంలో ప్రభుత్వం ఆదర్శంగా వుండాలి. ఇందుకు విలాస వస్తువుల దిగుమతిపైన, దేశంలో వాటి తయారీపైన నిషేధం పెట్టాలి.

## ప్రజాస్వామ్య హక్కులు - పౌరస్వాతంత్ర్యాలు

రాజ్యాంగ మూలభావాన్నే ఉల్లంఘించి ప్రభుత్వం జాతీయ అత్యవసర పరిస్థితిని కొనసాగిస్తున్నది. చట్ట బద్ధ పాలనను ఒక క్రమపద్ధతి ననుసరించి తొలగిస్తూ దాని స్థానంలో ఆంతరంగిక భద్రతా నిర్వహణ చట్టాన్ని (MISA) భారతదేశ రక్షణ నిబంధనలను (DIR) ఆర్డినెన్సుల ద్వారా పరిపాలన ప్రవేశపెట్టబడుతున్నాయి. చాలమందికి, ప్రజాస్వామ్య హక్కులు నిరాకరించ బడుతున్నాయి. ప్రజల న్యాయసమ్మతమైన, శాంతియుత పోరాటాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పోలీసులను ఉపయోగించి అణచి వేయబడుతున్నాయి. ప్రజాస్వామ్యపు అంతర్శక్తిని పునరుద్ధరించటానికి, పరిరక్షించటానికి, విస్తృతపరచటానికి మాకోర్కెలవి:

1. అత్యవసరస్థితిని తక్షణమే తీసివేయాలి. దానితోపాటు పౌర స్వాతంత్ర్యాలతో విరోధించే ఆంతరంగిక భద్రతా నిర్వహణ చట్టాన్ని, భారతదేశ రక్షణ నిబంధనలను, ఇతర శాసనాలను తీసివేయాలి.

2. పాఠశాలల్లోను, కళాశాలల్లోను, విశ్వవిద్యాలయాల్లోను ఉన్న బోధనా సిబ్బందికి; తదుద్యులకూ పూర్తి రాజకీయ, ట్రేడ్ యూనియన్ హక్కులు ఇవ్వాలి.

3. ప్రభుత్వ రంగంలోని వాణిజ్య పారిశ్రామిక సంస్థల కార్మికులకు, ఉద్యోగులకు పూర్తి రాజకీయ ట్రేడ్ యూనియన్ హక్కులు కలిగించాలి.

## స్వేచ్ఛాయుతమైన, న్యాయమైన ఎన్నికలు

ప్రజల కోర్కెల కనుగుణంగా ఇంకా అధికంగా ప్రతిస్పందించే విధంగా పార్లమెంటును, శాసనసభలను తయారు చేయడం ఎంతో ముఖ్యం. ఎన్నికలను అధికార యంత్రాంగము ధనశక్తి ప్రభావాలకు లొంగనీయకూడదు. వత్తిళ్ళకు తావీయ కూడదు. అందువల్ల మేము కోరేది :

1. పాలకపక్ష సభ్యులు కూడా ఉన్న ఎన్నికల సంస్కరణలపై సంయుక్త పార్లమెంటరీ సంఘ ఏకగ్రీవ సిఫార్సులను తక్షణమే అమలు పరచాలనీ,

2. ఎన్నికల నిర్వహణా కార్యక్రమం ప్రకటించబడ్డ తర్వాత ప్రభుత్వం ప్రధానమైన విధాన ప్రకటనలు (Major Policy Statements) చేయటాన్ని, ప్రాజెక్టులను మంజూరు చేయటాన్ని, పునాదిరాళ్ళను వేయడాన్ని, ఓటర్లను వ్యామోహ పరచే తదితర చర్యలను చేయటాన్ని, అనుమతించరాదనీ,

3. ఎన్నికల సంఘం (Election Commission) బహుళ సభ్యుల సంఘంగా ఉండాలి. సందేహాస్పదులుకాని సత్శీలురైన సుప్రీం కోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు లాంటి వ్యక్తులు యీ సంఘాలలో ఉండాలి. వారు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకుడు ( లేదా అన్ని గ్రూపులకు అంగీకారమైన ప్రతిపక్ష ప్రతినిధి) వీరితో ఏర్పాటు చేయబడ్డ ఒక బోర్డు చేత నిర్ణయించబడాలనీ,

4. రాజకీయ పార్టీలు ఎన్నికల వ్యయాల లెక్కలను సమర్పించేటట్లు కోరబడాలి. అభ్యర్థులు దాఖలు చేసే లెక్కలలో పార్టీలు సాధారణ పార్టీ కార్యక్రమానికి పెట్టిన ఖర్చుతోపాటు అభ్యర్థులకు వ్యక్తిగతంగా పెట్టిన ఖర్చుకూడ చేర్చబడాలనీ,

5. ఆకాశవాణి దూరదర్శిని, ప్రభుత్వ వాహనాలు, విమానాలు, ఇతర ప్రభుత్వ యంత్రాంగాన్ని పాలక పక్షం దాని ప్రయోజనాలకు ఉపయోగించుకోవటాన్ని నిషేధించాలి. అయితే ప్రతి పక్షాలు కూడ, దానితో సమానంగా వాటి వినియోగాన్ని అంగీకరించినప్పుడు అలా చేయవచ్చుననీ,

6. ఎన్నికలు జరిగేనాడూ, అంతకు ఒక వారంముందూ మద్య పానాన్ని నిషేధించాలనీ,

7. పోలింగునాడు అత్యవసర సర్వీసులలో ఉన్నవి మినహా ప్రైవేటు కార్లతో సహా అన్ని వాహనాలనూ రోడ్ల మీద తిరగ నీయరాదనీ,

8. ఓట్ల లెక్కింపు బూత్‌లవారీగా జరగాలి. పోలింగు అయిన వెంటనే ప్రతి పోలింగ్ స్టేషన్‌లోని బ్యాలెట్ పత్రాల లెక్క వెల్లడించాలి. మూడు నాలుగు బ్యాలట్ పెట్టెలకు బదులు ఒకే ఒక పెట్టె ప్రతి బూత్‌లోను ఉండేటట్లూ అదనంగా అవసరమైతే మరొకటి పెట్టడానికి ఏర్పాట్లు చేయబడి ఉండాలనీ,

9. పోటీచేస్తున్న అభ్యర్థులందరి పోలింగు ఏజంట్లకు ఆయా పోలింగు స్టేషనులో మొదటి చివరి బ్యాలట్ పత్రాల నంబర్లతో సహా మొత్తం పోలైన లేదా మరొక విధంగా ఉపయోగించిన బ్యాలట్ పత్రాల మొత్తం లెక్కను తెలుసుకునే అవకాశం కలిగించాలనీ,

10. ఓటింగు వయసు 18 ఏళ్ళకు తగ్గించాలనీ,

11. రాజ్యాంగంలో వెనక్కు పిలిచే హక్కు (right of recall) కలిగించాలి.

## రాజకీయ అధికార వికేంద్రీకరణ

అధికార కేంద్రీకరణ ఆధికమవుతున్నది. క్రింది స్థాయిలో ప్రజాస్వామ్యం ప్రభుత్వం చేత నాశనం చేయబడుతున్నది. వీటిని దృష్టిలో పెట్టుకున్నప్పుడు అధికారాలను వికేంద్రీకరించి వాటిని గ్రామ పంచాయతీలు, జిల్లా పరిషత్తులు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల మధ్య పటిష్టంగా విభజించటం ద్వారా సిసలైన స్వయం పరిపాలన ఏర్పరచేందుకు రాజ్యాంగ బద్ధమైన హామీని కలిగించటం అవసరం.

## విద్యా విధానంలో సంస్కరణలు

1. ఈ పత్రంలో ఆకాంక్షించిన ఆదర్శాల ఆధారంగా ఒక సమాజ నిర్మాణానికి విద్య సాధనంగా ఉండాలి; అది పాశ్చాత్యయీకరణకు బదులుగా ఆధునికీకరణకు దారితీసేదిగా ఉండాలి.

2. జాతీయ అవసరాలకు అనుగుణంగా విద్యను గుణాత్మకము సారభూతమైనదిగా పెంపొం దించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. ప్రతిస్థాయిలోనూ ప్రస్తుత పద్ధతిని మార్చాలి.

3. జీవనభృతికి హామీ కలిగించే ఆర్థిక ప్రణాళికా విధానంతో జోడిస్తూ సెకండరీ దశ నుండి విద్యను వృత్తి విద్యాయుత మైనదిగా చేయాలి. విశ్వవిద్యాలయ డిగ్రీ విద్యకు సంబంధించిన ఉద్యోగానికే గాని మరొకందుకు అవసరమైనది కాగూడదు.

4. అయిదు సంవత్సరాలలో సార్వజనీనమైన ప్రాథమిక, వయోజన విద్యాబోధనా సాధనకు అగ్ర ప్రాధాన్యం యివ్వాలి.

5. విద్యా సంస్థలలో ప్రభుత్వం జోక్యం చేసుకోవటంపై అదుపు ఉండాలి. ఈ సంస్థల నిర్వహణ సాధారణంగా బోధనా సిబ్బందికి అప్పగించబడాలి. దానితోపాటు విద్యార్థులు ప్రజా స్వామ్య బద్ధంగా పాల్గొనేటట్లు చేయాలి.

## రాజకీయ అవినీతి నిర్మూలన

అవినీతి మన రాజకీయ జీవన జీవనాడులనే కృంగదీస్తున్నది. అది అభివృద్ధిని భంగపరుస్తున్నది. పరిపాలనను దిగజార్చుతున్నది, శాసనాలను, నిబంధనలను నగుబాట్లపాలు చేస్తున్నది. అది ప్రజల విశ్వాసాన్ని నశింపజేస్తున్నది; వారి సహనాన్ని హరించివేస్తున్నది.

కేన్సరులాంటి యీరుగ్మత నుండి ప్రజా జీవితాన్ని పరిశుభ్రపరచటానికి మేము యీ క్రింది చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

1. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులతోసహా ఉన్నత స్థానాల్లో ఉన్న వ్యక్తులపై వచ్చిన ఆరోపణలను విచారించే అధికారాలతో ఉన్నతాధికార న్యాయనిర్ణయ ట్రిబ్యునళ్లను నియమించాలి. అవినీతి ఆరోపణలు నిరూపితమైన కేసులలో తత్సంబంధమైన వ్యక్తులను శిక్షించటం విధిగా జరగాలి. అన్ని కేసులలోనూ విచారణా నివేదికలను ప్రచురించాలి.

2. అవినీతి ఆరోపణలకు సంబంధించి సంతానం కమిటీ సిఫార్సులను అమలు చేయాలి. విచారించటానికి కావలసిన ప్రాథమికమైన కేసు ఉన్నదా లేదా అనే అనుమానమున్న సందర్భంలో ఆ విషయం ఒక సుప్రీం కోర్టు న్యాయమూర్తి లేదా హైకోర్టు న్యాయమూర్తి లేదా న్యాయనిర్ణయ ట్రిబ్యునళ్ళచేత నిర్ణయించబడాలి. అలాంటి ట్రిబ్యునళ్ళు ప్రభుత్వ కార్యనిర్వాహణ వర్గం నుండి స్వతంత్రమైనవై తగినన్ని అధికారాలు కలిగి ఉండాలి.

3. ప్రజాపాలనకు చెందిన కార్యాలను నిర్వహించే వారందరూ వారు తమ పదవీబాధ్యతలు స్వీకరించిన తక్షణమే, ఆ తర్వాత నియమిత కాలాలలో తమ తమ ఆస్తిపాస్తులను వెల్లడించాలని కోరే ఒక శాసనాన్ని రూపొందించాలి.

# సంపూర్ణ విప్లవం

- శ్రీ జయ ప్రకాశ్ నారాయణ

**వ్యవస్థ, ప్రజలు ఒక్కసారే మారాలి:**

సంపూర్ణ విప్లవం అంటే ప్రజల సరళి అంతా మనం ఆశించే దిక్కుగా ప్రయాణించుటకు విప్లవాత్మకంగా మారడం. జీవితంలోని ఒక భాగాన్ని మాత్రమే మార్చి, మిగిలిన భాగమంతా కుళ్ళిపోవచ్చుననుకుంటే మనం అభివృద్ధి చెందలేము. విధానములో కుళ్ళు ప్రవేశిస్తే ఆరోగ్యకరమైన భాగాలకు కూడా అది విస్తరిస్తుంది. అందుచేత మన మొత్తం సామాజిక వ్యవస్థ ఆంతరంగికం నుంచి పూర్తిగా మారాలి.

ఈ పోరాటం పరిమితమైన ఆదర్శం కొరకు కాదు. దీనియొక్క లక్ష్యాలు విశాలమైనవి. మన దేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థని బలపర్చి, ప్రజల ప్రభుత్వాలు ఏర్పాటు చేయడం, అన్యాయాలు, దోపిడీలు అరికట్టి సాంఘిక, ఆర్థిక, విద్య, సాంస్కృతిక రంగాలలో విప్లవాన్ని సాధించడం, ఒక నవ భారతాన్ని సృష్టించడం. నేను ఎన్నో సార్లు చెప్పినట్లుగా యువకులే ఈ విప్లవానికి అగ్రగాములు. ఈ పని చాలా కష్టమైనది. ఈ భావాలను ఆచరించటం కూడా అంత తేలిక కాదు. ఇందుకు కొంత త్యాగం, బాధలు అనుభవించే ధైర్యం అవసరం.

లాఠీలను, తుపాకులను ఎదిరించాలి. జైళ్ళకు వెళ్ళాలి. మరెన్నో కష్టాలు రాగలవు. ఎందుచేతనంటే ఇది ఒక విప్లవం కనుక. అయినా ఇది యుగ వాంఛ. కనుక మీరు (యువకులు) తప్పక విజయవంతం కాగలరు.

ఈ సంపూర్ణ విప్లవంలో వ్యవస్థ, వ్యక్తులు కూడా మారాలి. ఒకరి తర్వాత ఒకరుకాదు. ఒకే సమయంలో ఇద్దరూ మారాలి. ''సమాజం కొరకు వ్యక్తి - వ్యక్తి కొరకు సమాజం'' పరస్పరాశ్రితంగా జీవించే సాంఘిక వ్యవస్థానిర్మాణం ఒక్క రోజులో జరిగేది కాదు. ఏ విప్లవం కూడా ఒక్క రోజులోనే పూర్తి కాలేదు. మన విప్లవం కూడా నిరంతరం అధిరోహిస్తుంది. ఇందులో విజయవంతం అగుటకు ప్రజాస్వామ్యం ఎడల గల ప్రాశ్చాత్య భావాలను, అభిప్రాయాలను మన మనస్సుల నుంచి తొలగించు కోవాలి. స్వేచ్ఛగా మనం నూతన భావాలతో ముందుకు రావాలి.

**హింసాయుత సాధనాలు - శాంతి యుత సాధనాలు:**

శాంతియుత సాధనాలపై యిలా నొక్కి చెప్పడం గాంధీ విధానపు చాదస్తం అని మీరు అనవచ్చు. ప్రజల పోరాటం యొక్క ఎత్తుగడల్లో శాంతియుత సాధనాలకు కట్టుబడి వుండడంలోనే మనకు విజయావకాశాలున్నాయి. మీరు కనుక ఒక్క హింస చేస్తే ప్రత్యర్థులు మన మీద వందల కొద్దీ హింసాచర్యలు జరుపుతారు. అందుచేత హింసకు సంబంధించిన మీ భావాలను మీ మనస్సుల్లోంచి తీసివేయండి.

ఒక నిజమైన చక్కటి ప్రజా స్వామ్యాన్ని ఏర్పరుచుటకే ఈ పోరాటం. శాంతి గురించి లెక్క చేయకుండా హింసద్వారా అటువంటి సమాజాన్ని మనం తేలేము. శాంతియుత సాధనాల గురించి పట్టుబట్టడం గాంధేయ చాదస్తమైతే, రేపు పాట్నాలో ఒక ఎన్నిక పెట్టేమనుకోండి అందులో యిరుపక్షాలు హింసను ధారాళంగా ఉపయోగిస్తే ఏమౌతుంది? చక్కటి ప్రజాస్వామ్యస్థాపన

జరుగుతుందా? ఇది ఆలోచించవలసిన విషయం. శాంతి, ప్రజాస్వామ్యం అనేవి ఒకే నాణానికి బొమ్మ, బొరుసు వంటివి. ఒకటి లేకుండా మరొకటి నిలద్రొక్కుకోలేదు. గతంలో చాలా గొప్ప విప్లవాలు జరిగేయి. వాటి నుంచి మనం నేర్చుకొనేది ఏమిటి? హింసాయుత విప్లవం జరిగినచోట కార్మికుల, కర్షకుల రాజ్యం ఏర్పడిందంటారు. నిజంగా అలా జరిగిందా? ఎవరి చేతిలో తుపాకి ఉంటే వారిదే రాజ్యంగా ఉంది.

శాంతి, ప్రజాస్వామ్యము రెండూకలసి ఉన్నప్పుడే నిజమైన ప్రజా ప్రభుత్వం ఏర్పడ గలుగుతుంది. ''ప్రజల కొరకు ప్రభుత్వం'' ఏర్పడవచ్చుగాని ''ప్రజల చేత ప్రభుత్వం'' ఏర్పడడం అసాధ్యమని రాజ్యాంగ కోవిదులు అంటారు. అబ్రహాంలింకన్ ఆశించిన ''ప్రజల చేత ప్రభుత్వం'' ఎక్కడా, ఎవరూ తేలేరనీ వారి భావన. కాని, మనం శాంతియుత పద్ధతులకు, ప్రజా స్వామ్యానికి కట్టుబడి వుంటే తప్పక తేగలమని నేననుకుంటున్నాను. మరి వేరేయే వ్యవస్థలోనైనా సరే ప్రజలచే ఏర్పడే ప్రభుత్వం అసాధ్యమౌతుంది. ప్రజల పేరు మీద ఒక ముఠా ప్రభుత్వాన్ని ఏర్పరుస్తుంది. వాళ్ళు ప్రజలను అవసరాన్ని బట్టి నలిపివేస్తారు. అందుచేత శాంతి అనేది కేవలం గాంధేయ చాదస్తం కాదు. అది ఒక అత్యవసరస్థితి. మనం ఒక నూతన భారతదేశాన్ని నిర్మించాలనుకుంటున్నాం. హింస ముసుగులో మన గ్రామాలలో దోపిడీలు జరగాలని మీరు కోరుకుంటారా? ఈ దేశంలో ఆంతరంగిక కల్లోలం, గృహయుద్ధం కావాలని మీరు కోరుకుంటారా? హింసవల్ల జరిగేది అదే. ప్రజలు తమలో తాము పోట్లాడుకుంటారు. భారతదేశ చరిత్రలో తరచు జరిగినట్లు ఆంతరంగిక కల్లోలంవల్ల దేశం నాశనమైపోతుంది. అందుచేత దయచేసి హింసగురించి మాట్లాడడం ఆపండి. హింసగురించి మాట్లాడడంలో కొంత సాహసం ఉండవచ్చుగాక. కాని, అందులో దూరదృష్టిలేదు.

నాకు హింసలో నమ్మకంలేదు. ఎందుకంటే నేను ప్రజాస్వామ్యాన్ని నమ్ముతాను కనుక. నాకు ప్రజలలో నమ్మకం ఉంది. తుపాకులు భుజాన వేసుకున్నవాళ్ళు ప్రజల భుజాలమీద కెక్కాలనీ, ప్రజల పేరుమీద వారు రాజ్యం చెయ్యాలనీ నేను కోరను. ప్రజలలో నమ్మకం లేనటువంటి వారే ప్రజల విశ్వాసాన్ని పొందలేనటువంటి వారే హింసలోనికి దిగుతారు. ప్రజల శక్తి సంఘటితమైన చోట హింస అనవసరం. ప్రజల శక్తి సంఘటితం కానప్పుడు వచ్చే హింస చాలా క్రూరంగా ఉంటుంది.

ఈ ఉద్యమాన్ని నడుపుతున్న మేము, మాకై రాజకీయాధికారం కోరడం లేదు. ప్రజలకు అధికారం అప్పగించాలనేదే మాకోరిక. హింసాయుత విధానం యేపరిస్థితులలోనూ మాకు పనికి రాదు. ఇప్పుడున్న పరిస్థితులలో హింస అరాజకానికి దారి తీస్తుంది. దేశంలో వ్యాపించివున్న తీవ్రమైన అసంతృప్తిని శాంతియుత పోరాటం లోనికి క్రమబద్ధం చెయ్యాలి. లేకపోతే ఎవరు ప్రభుత్వాధినేతగా ఉంటారో ఇందిరాజీ కానివ్వండి, మరెవరైనా కానివ్వండి వారు నియంతృత్వాన్ని విధిస్తారు. సైన్యం పైచేయి పొందుతుంది. అరాజకం గనుక కొనసాగితే దేశం ముక్కలు ముక్కలై నాశనమై పోతుందని, అందుచేత ఒక గట్టి నియంతృత్వ ప్రభుత్వం అవసరమని వారంటారు. ఇప్పటికే కొందరు మేధావులు ప్రజాస్వామ్యం సమస్యలు పరిష్కరించుటలో విఫలమైందని, అందుచేత గట్టి నియంతృత్వం ఒక్కటే మార్గమని అంటున్నారు. ప్రజాస్వామ్యం విఫలమైంది కనుక అసలు ప్రజాస్వామిక వ్యవస్థనే రద్దు చేద్దామని వీరంటారు. ప్రజల అసంతృప్తి ఉద్రేకాలతో కూడిన హింసా రూపం తీసుకున్నప్పుడు జరిగేది ఇదే. సైన్యం సహాయంతో ఎవరో ఒకరు అధికారం హస్తగతం చేసుకుని ప్రజాస్వామ్యం విఫలమైంది కనుక దానిని రద్దు చేస్తున్నాము అనవచ్చును. ఇది జరగరాదని

నా భావన. నా శక్తినంతా ఉపయోగించి నేను దీనిని వ్యతిరేకిస్తాను. అందుచేత మనం ఏం చెయ్యాలి? తాము పడే బాధలవల్ల ప్రజలలో ప్రజ్వలితమైన అసంతృప్తినీ, కోపాన్ని, వ్యతిరేకతనీ శాంతియుత విప్లవాత్మక ఉద్యమంగా రూపొందించాలి.

హింసాయుత ఉద్యమానికి నా వ్యతిరేకత వ్యావహారిక కారణాలమీదనే కాని నైతిక కారణాల మీద కాదు. హింసాయుత ఉద్యమం త్వరగా ఫలితాలిస్తుందని అనుకోవడం కూడా భ్రమే. అహింసాయుత ఉద్యమంకంటే హింసాయుత ఉద్యమాన్ని త్వరగా సాధించవచ్చును అనేదానికి చరిత్రలో ఎక్కడా ఆధారాలు లేవు. ఇంతవరకూ ప్రపంచ చరిత్రలో వచ్చిన హింసా ఉద్యమాలు ఏవీ కూడా త్వరగా సఫలం కాలేదు. అంతేగాక వాటి లక్ష్యాలు ఇంతవరకూ కూడా నెరవేరలేదు. విప్లవ నాయకత్వం రాజకీయ అధికారాన్ని హస్తగతం చేసుకున్నంత మాత్రాన విప్లవం విజయవంతమైనట్లు కాదు. అధికారాన్ని హస్తగతం చేసుకోవడం విప్లవ చరమాంకం కాదు. అది కేవలం పాత వ్యవస్థ పతనమే. యే విప్లవానికైనా తుది లక్ష్యం కాదు. లక్ష్యం ఎప్పుడూకూడా నూతన వ్యవస్థను నిర్మించడమే. హింస ననుసరించే వారు నూతన వ్యవస్థా నిర్మాణానికి ఎన్ని సంవత్సరాలు తీసుకుంటారు? హింసాయుతంగా పాత వ్యవస్థను కూల ద్రోయడంలో విజయవంతమైన వెంటనే తమచేతుల్లోనే అధికారాన్ని వుంచుకోవడానికి విప్లవకారులు ప్రయత్నం చేస్తారు. ఇలాంటి స్థితిలో అధికారాన్ని కాపాడు కోవడం కొరకు వారు సాగించే పోరాటంలో నిలద్రొక్కుకున్నప్పటికి, తాము కనిన కలలు యదార్థం చేయుటకు వారికి ఎన్ని దశాబ్దాలు కావాలో!

సాధారణంగా హింసాయుత విప్లవం తర్వాత వచ్చే సామాజిక వ్యవస్థ విప్లవకారుల ఆశలకి, ఆశయాలకి భిన్నమైనదిగా ఏర్పడ్డం జరుగుతుంది. ఒక్కొక్కప్పుడు పూర్తిగా వ్యతిరేకమైన వ్యవస్థ రావడం కూడా జరుగుతుంది. విప్లవానికి ముందు తాము ఏ వ్యవస్థ నాశించారో అట్టి వ్యవస్థ విప్లవానాంతరం నిర్మించడంలో తరచు విప్లవకారులు విఫలమౌతున్నారు.

తాను పెట్టుకున్న లక్ష్యాలు చేరిన హింసాయుత విప్లవం ఏదైనా మనకు కనబడుతుందా? ఫ్రెంచి విప్లవాన్ని తీసుకుంటే దాని లక్ష్యాలు స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాత్రం. ఆ విప్లవం జరిగి సుమారు రెండువందల సంవత్సరాలైనా ఇంకా ఆ లక్ష్యాలైన స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాత్రం ఫ్రెంచి సమాజంలోనికి రాలేదు. రష్యన్ విప్లవం జరిగి 50 సంవత్సరాలైంది. మరి అక్కడ కార్మికుల కర్షకుల చేతుల్లో అధికారం వుందా? ''సోవియట్లకే అన్ని అధికారాలు'' అని లెనిన్ యిచ్చిన అతి ముఖ్యమైన నినాదం. కాని ఏం జరిగింది? సోవియట్ యువకులకు భావ ప్రకటనా స్వాతంత్ర్యం లేదు. అందుచేతనే వారు రహస్య కరపత్రాలు వేస్తున్నారు. ''ప్రతి వ్యక్తి తన శక్తి కొద్దీ పనిచేసి తన అవసరాల బట్టి ఫలితాలు పొందగలిగే'' వ్యవస్థ సాంఘిక విప్లవం యొక్క లక్ష్యం.

రష్యాలో, చైనాలో వచ్చిన హింసాయుత వుద్యమ లక్ష్యం కూడా ఇదే. అయినా ''ఎవడు ఎంత పనిచేస్తారో అంతే ఫలితం'' అనే క్యాపిటలిస్టు సిద్ధాంతమే ఇంకా ఆ దేశాల్లో కూడా పని చేస్తుంది. విప్లవం యొక్క లక్ష్యాలను ఆచరణలో పెట్టుటకు గాను సామాజిక విలువలలో మార్పు కోసం ప్రజలను చైతన్య వంతులను చేయుటకు ఆ దేశాలలోని పరిపాలకులు చాలా కష్టపడుతున్నారు. తాము ఆశించిన లక్ష్యాలను సోవియట్ యూనియన్ ఎప్పటికి ఆచరణలో చూపించగలదో ఇంకా ఎవరికీ తెలియదు.

ఈ విధంగా ప్రపంచంలో వచ్చిన వివిధ హింసా వుద్యమాల చరిత్రని పరిశీలించి చూస్తే, సుదీర్ఘమైన కృషి అనంతరమే నూతన వ్యవస్థా నిర్మాణం కొంతైనా సాధించగలుగుతున్నారు. అందుచేత ఇంత ఎక్కువ సమయం తీసుకోవడంతో హింసాయుత విప్లవం ద్వారా ఫలితాలు నెమ్మదిగా వస్తాయని అర్థమవుతుంది. అహింసాయుత ఉద్యమంలో పాత వ్యవస్థని పడగొట్టడం, నూతన వ్యవస్థను నిర్మించడం రెండూకూడా ఒక దాని ప్రక్కనే ఒకటి జరుగుతాయి. అహింసాయుత విధానం యొక్క గొప్పతనం ఇదే. ఇవన్నీ ఆలోచించిన తర్వాత విప్లవం భారతదేశంలో వచ్చినా కూడా, దాని ఫలితాలు ప్రజలకు అందడానికి చాలాకాలం పడుతుందనే నిర్ణయానికి నేను వచ్చాను. అహింసాయుత విప్లవం త్వరగా విజయవంతమౌతుందనే నమ్మకం నాకు కలిగింది. అది అప్పుడే ప్రారంభమైంది.

మనం అర్థం చేసుకోవలసిన మరో విషయం : హింసాయుత విప్లవం సాంఘిక విప్లవాన్ని కూడా సాధిస్తుందనే హామీ లేదు. హింసాయుత విప్లవం తర్వాత వచ్చే వ్యతిరేకతవల్ల ఫాసిస్టు నియంతృత్వం ఏర్పడే ప్రమాదం కూడా లేకపోలేదు. లేదా అరాజకం గానీ, జాతీయ విచ్ఛిత్తి గానీ, విపరీతమైన కష్టాలు గానీ, మళ్లీ బానిసత్వంగాని రావచ్చు. హింసాయుత విప్లవం కావాలని కోరేవారు ఈ విషయాలు గమనించడం మంచిది.

మూడవ విషయం : హింసాయుత విప్లవం జరిగిన తర్వాత దయాదాక్షిణ్యాలు లేకుండా అతి క్రూరంగా వుండగలిగే ఒక చిన్న ముఠా అధికారాన్ని చేజిక్కించుకోవచ్చు. హింసాయుత విప్లవం తర్వాత ఇటువంటి స్థితి తప్పని సరియేమో అనిపిస్తుంది.

ఇక నాలుగవది : అతి ముఖ్యంగా గమనించవలసిన విషయం ఏమంటే విప్లవకారుల యొక్క మధుర స్వప్నాలకు అనుకూలంగా విప్లవాలు రావు. చారిత్రాత్మక సాంఘిక పరిస్థితులు పరిపక్వమైనప్పుడే విప్లవాత్మకమైన మార్పు వస్తుంది. మనం చరిత్రలో తరచు చూస్తున్న దానిని బట్టి ఇటువంటి పరిస్థితి తయారవడానికి ఒక్కొక్క శతాబ్దం పట్టవచ్చు. మన దేశంలో హింసాయుత ఉద్యమాన్ని నమ్మేవారు స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే, వినోబా తన ఉద్యమం ప్రారంభించక ముందే, తమ కృషి మొదలు పెట్టారు. తెలంగాణాలో రక్తపాతం ప్రారంభమైన రోజులనుంచి వారు కృషి చేస్తున్నారు. ఈ 22-23 సంవత్సరాల్లో వారు ఎంత అభివృద్ధి చెందారు? తెలంగాణాలోగాని, పశ్చిమ బెంగాల్లోగాని, హింసాయుత విప్లవం వచ్చిందా?

అంతరంగికంగా యే సమాజమైనా సిద్ధమయ్యేవరకు విప్లవం విజయవంతం కాదు. విప్లవ శాస్త్రం యొక్క మూల సూత్రం యిది. సాంఘిక వ్యవస్థ పరస్పర వైరుధ్యాలతో సతమతమై, ఉలుకలుకలు ఏర్పడినప్పుడు విప్లవానికి పరిస్థితి పరిపక్వ మౌతుంది. ఒక హద్దును దాటిన తర్వాత సాంఘిక సమస్యలు తీవ్రరూపం ధరిస్తాయి. కారల్ మార్క్స్ చెప్పినట్లు పరిమాణంలో గుణాత్మక పరిణామం వస్తుంది. ఒక సమస్య అతి తీవ్ర రూపం దాల్చినపుడు పరిస్థితిలో గుణాత్మకమైన మార్పు ఉద్భవిస్తుంది. అవినీతి విషయంలో యిప్పుడు యిదే జరిగింది. అవినీతి సహనపు సరిహద్దులను దాటి పోవడం ద్వారా ఒక గుణాత్మకమైన మార్పు ఏర్పడింది. విప్లవాత్మక పరివర్తనకు పరిస్థితి అనుకూలంగా ఉంది. ఈ మార్పు వచ్చి తీరుతుంది. లేకపోతే యీ సాంఘిక వ్యవస్థ కుళ్ళి పతనమైపోతుంది. కేవలం ఒక విప్లవాత్మక నాయకునివల్ల విప్లవాత్మక విప్లవం రాదు. లెనిన్ గాని,

మావో గాని, గాంధీ గాని అలాంటి అద్భుతమేమీ చేయలేదు. ఒక సామాజిక చారిత్రాత్మక పరిస్థితిలో నుంచి విప్లవం జన్మిస్తుంది. పరిస్థితుల పరిపక్వతని, కాలగమనాన్ని సరిగా అర్థం చేసుకోవడంలోనే విప్లవ నాయకుని విశిష్టత ఉంది.

**అహింసాయుతమా లేక శాంతియుతమా?:**

మహాత్మాగాంధీ రోజుల్లో కూడా స్వాతంత్ర్య పోరాటానికి ''శాంతియుత సాధనాలకు'' బదులు ''అహింసను'' కాంగ్రెస్ అంగీకరించలేదు. అలాంటప్పుడు అహింసాయుత సాధనాలు జనం మీద రుద్దుటకు నేనెవణ్ణి? అందుకే నేను శాంతియుత సాధనాలు అని వాడుతున్నాను. తమ కష్టాలకు బాధలకు వ్యతిరేకంగా, తమపై జరుగుతున్న దోపిడీ, అన్యాయాలు, దమన నీతికి వ్యతిరేకంగా శాంతియుత సాధనాలతో ప్రజలను పోరాడనివ్వండి. శాంతియుత పోరాట మార్గాలు ప్రజలకు కనుక తెరవబడి ఉండకపోతే, లక్ష్యంలేని, ఉద్రేక పూరితమైన, విచక్షణారహితమైన హింస వ్యాపిస్తుంది.

మనం స్వాతంత్ర్య పోరాటాన్ని తుపాకులు లేకుండానే జరిపాము. అప్పుడు మనకు శక్తి ఎలా వచ్చింది? ఎందులోంచి వచ్చింది? చావుకి కూడా వెనుదీయని త్యాగాలలోంచి శక్తి వచ్చింది. మొన్నీ మధ్య కొంత మంది ప్రదర్శకులు ఎవరినో తిట్టి ఎవరి చొక్కానో చింపివేశారు, అది తీవ్రతకాదు. అది అసభ్యమైన మోటుతనం. ఇటువంటి సంఘటనలు అహింసకి మంచివికావు. హింసకీ మంచివి కావు. మనం ఒక నైతిక విప్లవాన్ని తీసుకురావాలనుకుంటున్నాము. అందుచేత మన చేతలు మన లక్ష్యానికి అనుకూలంగా ఉండాలి. హింసకంటే అహింస ముందు ఉండాలని మనం కోరితే మనం త్వరత్వరగా కృషి చెయ్యాలి. లేకపోతే రాగల పరిణామాల్లో వరదవలె వస్తున్న హింస అహింసను తుడిచివేస్తుంది. అహింసను నమ్మేవారు ప్రజల సమస్యలకు అహింసాయుత పరిష్కార మార్గాలు యివ్వడంలో ఆలస్యంచేస్తే, చరిత్ర గమనంలో వారికి మళ్ళీ అవకాశం రాకపోవచ్చు. దురాశ, స్వార్థపరత్వం, అమానుషత్వం, అన్యాయాలు, దోపిడీ, అసమానతలు నిండిన నేటి వ్యవస్థని అంతం చేయవలసిందే. ఈ పనికి అహింస గనుక త్వరగా ముందుకు రాకపోతే, హింస వచ్చి దూకుతుంది. హింసవల్ల సమస్యలు పరిష్కారం కావు. దానివల్ల ఒక రకమైన అన్యాయాలు దోపిడీ, స్వార్థం, అసమానతలు పోయి మరో రకమైన స్వార్థం, దోపిడీ, అన్యాయాలు వస్తాయి. అయితే ఇది వేరే విషయం. కాని ప్రజలు ఈ విషయాన్ని అర్థం చేసుకునే సరికి కాలం మించిపోతుంది. అంధకారం అలుముకుంటుంది.

అందుచేత మన శక్తి యుక్తులన్నీ ఉపయోగించి పరిస్థితుల తీవ్రతను గమనించి మార్పుకు మనం వెంటనే పూనుకోవాలి. ఇందు కొరకు మన జీవితాలను సమర్పించాలి. ఇంత కంటే మంచి లక్ష్యం, మంచి అవకాశం మన జీవితాలకు దొరుకుతుందని నేను అనుకోను, విప్లవ దేవత సన్నిధిని తమ జీవితాలు అర్పించుటకు సిద్ధమయ్యేవారే ఈ విప్లవ సైన్యానికి వెన్నెముక అవుతారు. ఇది తీరిక సమయాల్లో సరదాగా చేసే పనికాదు. ఈ మార్పుకు జీవితాలు అంకితం కావాలి.

**కాలపరిమితి:**

ఒక సంవత్సరం లోపల ఈ సంపూర్ణ విప్లవాన్ని తీసుకొని రాలేము. అలాగని దీని సాఫల్యానికి 50 సంవత్సరాలూ అవసరం లేదు. మామూలు పరిస్థితులలో దశాబ్దాలు, శతాబ్దం పట్టే మార్పులు

విప్లవ సన్నివేశంలో నాల్గైదు సంవత్సరములలో జరుగవచ్చునని నేను పదేపదే చెప్పాను. అందుచేత కాలపరిమితిని గుర్తించమని కోరుతున్నాను. పాతవాదనలను పాత వివాదాలను లేవనెత్తుతూ, పాత గాడిలోనే మనం పోతూ ఉంటే ఇదివరకు చేసిన చిన్న చిన్న పనులే చేసుకుంటూ పోతాం, మహత్తర కార్యాలు సాధించలేం.

ఈ ఉద్యమాన్ని సమర్థిస్తున్న అతివాద పార్టీలు, ముందుగా ఒక కార్యక్రమాన్ని కాగితం మీద పెట్టి విప్లవ ప్రభుత్వం దాన్ని అమలు పరచాలి అంటారు. ముందుగా ఆలోచించి పెట్టిన ప్రకారం, పాఠ్యగ్రంథంలో వ్రాసిన ప్రకారం విప్లవం ఎక్కడా రాలేదని నేను వారికి చెప్పాను. ఆ పాఠ్యగ్రంథం మార్క్సుది కానివ్వండి, లెనిన్‌ది కానివ్వండి, మావోది కానివ్వండి మరెవరిదైనా కానివ్వండి. ప్రతి విప్లవం తన పాఠ్యగ్రంథాన్ని స్వంతంగా వ్రాసుకొంటుంది. ఇది ఒక ప్రజా ఉద్యమం. అభివృద్ధి చెందుతున్న కొద్దీ నూతన దృష్టి, నూతన రూపం, నూతన కార్యక్రమాలూ వస్తాయి. అయిదు సంవత్సరాల తర్వాత విప్లవ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అది అప్పుడు ఏమేమి చేయాలో చెప్పడానికి నేనెవరిని ? తమ కార్యక్రమాలను ప్రజలే రూపొందించుకుంటారు. ప్రస్తుతం మనం విశాలమైన విప్లవ సౌధ ప్రవేశ ద్వారం ముందు నిలబడి వున్నాము. సమానత్వం, స్వాతంత్ర్యం, సౌభ్రాత్రం, ప్రభుత్వ రహిత సమాజం మొదలైన ఆశయాలను ఆచరణలోకి తీసుకురావాలని ఈ యుగం నినాదిస్తుంది. ''ప్రతి ఒక్కరూ శక్తి కొద్దీ పనిచేసి అవసరాలకు అనుగుణంగా ఫలితాలు పొందే'' వ్యవస్థా నిర్మాణం కోసం ఈ యుగానికి తహ తహ ఎక్కువైంది. ఈ ఆశయాలను ఆచరణలో చూపాలనే డిమాండ్ పెరిగింది. గాంధీజీ తరచు మనకు ఒక విషయం చెప్పేవారు. ఇతర విప్లవాలు సామాజిక వ్యవస్థ యొక్క బాహ్యరూపాన్ని మారిస్తే, తాను ఆశించే విప్లవం రెండు పనులు చేస్తుందని, అది మానసీయ విప్లవమై, మానవుల మనస్సులను, హృదయాలను మార్చి తద్వారా బాహ్య పరిస్థితిని కూడా మారుస్తుందని ఆయన అనేవారు. అది ఒక సాంఘిక విప్లవం అది ఒక ఆధ్యాత్మిక విప్లవం.

మన దేశపు ఆధ్యాత్మిక సంపద అటువంటి విప్లవానికి పిలుపిస్తోంది. ఆ పిలుపునందుకోవడానికి ఎవరు ముందుకొస్తారు? ఈ దేశంలో ఆధ్యాత్మికతను అందుకున్న వారందరూ యువకులే గాని వృద్ధులు కారు. జీవన సంగ్రామంలో శ్రీ కృష్ణుడు ఆధ్యాత్మిక శంఖం పూరించినప్పుడు యువకుడే కాని వృద్ధుడు కాడు. నవజాత శిశువు రాహుల్ యవ్వనవతి యగు తన భార్య ఒడిలో నిద్రిస్తుండగా వారిని వదిలి అద్వితీయ సాంస్కృతిక విప్లవ పథం పై ప్రయాణం సాగించిన సిద్ధార్థుడు ఆపని చేసింది యవ్వన ప్రాయంలోనే గాని వృద్ధాప్యంలో గాదు. అద్వైత అన్వేషణలో తన సందేశాన్ని నలుదిక్కులా వ్యాపింపజేయుటకు బయలు దేరిన ఆది శంకరులు యువకులు, చికాగో వేదికపై నుంచి విశ్వజనీన మతమైన వేదాంతాన్ని బోధించినపుడు స్వామి వివేకానంద యువకుడే. దక్షిణాఫ్రికాలోని వర్ణదేశపు అగ్నిగుండంలో దూకి సాహసోపేతంగా ఆధ్యాత్మికశక్తితో ప్రయోగాలు జరిపిన గాంధీజీ కూడా యువకుడే గాని వృద్ధుడు కాదు. అందుచేత మిత్రులారా ఆధ్యాత్మికత అనేది వార్థక్యపు జీర్ణత్వం కాదు. అది యువశక్తి యొక్క అత్యుత్తమ విహంగమ యానం.

ఈ విధంగా నేను నిర్దేశిస్తున్న ఈ విశిష్ట విప్లవానికి యువకులే సైనికులు యువకులే సేనాపతులు ఈ సాంస్కృతిక విప్లవం రాకుండా భారతదేశం గానీ, భారతీయ సాంస్కృతిగానీ నిలద్రొక్కుకోలేవు. జీవించలేవు.

# ఉద్యమాలే ఊపిరిగా ఎదిగిన ప్రజల మనీషి జయప్రకాశ్

- ఎ.బి.కె. ప్రసాద్

**ప్రజాశక్తి - ప్రభుత్వ శక్తి**

''దేశ నిర్మాణంలో పాలుపంచుకునే శక్తులు రెండే రెండు. అవి ఒకటి ప్రభుత్వ శక్తి, రెండవది ప్రజాశక్తి. ఈ రెండూ ఒకదానితో మరొకటి సమన్వయంతో దేశ నిర్మాణానికి కృషి చేయాలి. ఈ రెండు శక్తులూ ఒక్కోసారి విప్లవశక్తి అనే మరో శక్తిని ఎదుర్కొనవలసి రావచ్చు. అయితే అటువంటి సమయంలో శ్రీమతి ఇందిరాగాంధీ ప్రవర్తించిన విధంగా జనతాపార్టీ నాయకులు ప్రవర్తించరని ఆశిస్తున్నాను. అధికారంలో ఉన్న వారు ప్రజాభీష్టాన్ని అవగాహన చేసుకోవాలి తప్ప తృణీకరించరాదు.''

(1977లో జనతాపార్టీ లోక్‌సభ సభ్యుల ప్రథమ సమావేశంలో)

- జయప్రకాశ్

ప్రజా ఉద్యమాలే ఊపిరిగా నేటికీ జీవించియున్న కొలదిమంది జాతీయ నాయకులలో స్వాతంత్ర్య సమరయోధులలో ఒకరు జయప్రకాశ్‌నారాయణ్. న్యాయవాద వృత్తిలో ''ఒరిజినల్ సైడ్'' అని ఉంటుంది. అలాగే జయ ప్రకాశ్ ఒరిజినల్‌గా సోషలిస్టు, క్రమంగా గాంధేయవాదిగా స్థిరపడిన వ్యక్తి. జాతీయోద్యమంలో సమరశీల రాజకీయాలతో జీవితాన్ని ప్రారంభించి, ఉద్యమ అనుభవాల ద్వారా ''అధికారం కోసం వెంపర్లాడే'' రాజకీయాలను విడనాడి కేవలం సేవాధర్మంతో గాంధేయ సూత్రాలవైపు ఆకర్షితుడైన వ్యక్తి జయప్రకాశ్. మార్క్సిజంలోని ఆర్థిక సూత్రాలనూ గాంధీయిజంలోని నైతిక సూత్రాలను కలగలిపి ఆ రెండింటి ఆధారంగా నవభారత నిర్మాణంకోసం సుమారు అయిదు దశాబ్దాలుగా కలలు కంటున్న నాయకుడు. వ్యక్తి గత జీవితంలో నిరాడంబరత, పబ్లిక్ జీవితంలో నిష్కళంక ప్రవర్తన మూర్తీభవించిన జయప్రకాశ్ పాక్షిక విప్లవాన్నైనా పరిపూర్ణ విప్లవాన్నైనా జయప్రదం చేయగల సామర్థ్యం కలవాడు. రాజకీయాలకు అతడు అతీతుడు కావచ్చు గాని ప్రజా సమస్యల విషయంలో అతడు ప్రజాపక్షపాతి. అందువల్లనే జాతీయోద్యమ కాలంలో అతడు సుందర్‌బాన్‌లో గెరిల్లా ఉద్యమాన్ని నిర్మించినా, రెండేళ్ళనాడు బీహార్‌లో అవినీతికి ప్రజావ్యతిరేక పరిపాలనకు నిరసనగా మహోధృతంగా యువకులతో ఉద్యమాన్ని నిర్వహించినా, నేడు జనతాపార్టీ స్థాపనకూ దాని విజయానికి దోహదంకాగల దేశవ్యాప్త ఎన్నికల సమరానికి రూపు రేఖలు దిద్దినా - కేవలం ప్రజా సమస్యల పరిష్కారం కోసమేగానీ తన స్వార్థంకోసం కాదు. గాంధీ, నెహ్రూతో సహా ఎందరెందరో జాతీయ నాయకులతో తనకుగల సాన్నిహిత్యాన్ని వినియోగించుకుని ఉంటే జయప్రకాశ్ ఏనాడో అందలం ఎక్కి ఉండేవాడు, ఆ ఆశ అతనికి ఆనాడూ లేదు, ఈనాడు లేదు. త్యాగాలకు అడ్వాన్సు గ్యారంటీలు కోరే స్వార్థమూర్తి అంతకంటే కాదు జె.పి. అందువల్లనే అతడు బ్రిటిష్ సామ్రాజ్యవాదుల పాలనలోనే కాదు, స్వాతంత్ర్యానంతరం కాంగ్రెస్ పాలనలో

కూడా - ఈ వృద్ధాప్యంలో సహితం - రకరకాల ఆంక్షలకూ ప్రభుత్వ ఆగడాలకూ గురికావలసి వచ్చింది. జైళ్ళలో మగ్గవలసి వచ్చింది.

అన్యాయాలకు ఎదురుతిరిగే మనస్సు ఆంక్షలను సహించదు. ఈ ప్రాథమిక పాఠం అతను స్వాతంత్ర్య సమరంలోనే నేర్చుకొన్నాడు. తిలక్, అనిబిసెంట్‌ల అనుభవాలు గుణపాఠాలయ్యాయి; గాంధీజీ సాహచర్యం సహనాన్ని నూరిపోసింది. అనిబిసెంట్ హోమ్‌రూల్ (స్వపరిపాలన) ఉద్యమం సాగిస్తున్నప్పుడు అప్పటి మద్రాసు గవర్నర్ లార్డ్‌పెంట్లాండ్ ''ఉద్యమాన్ని ఆవిడ విరమించు కోక పోతే రాజకీయేతర కార్యకలాపాలతో సహా ఆవిడ కార్యక్రమాలన్నింటినీ ఆటకట్టించవలసింద''ని బెదరించాడు. దానికి సమాధానంగా ఆమె ''అది వాళ్ళతరం కాదు, ఇండియాలో వ్యక్తి స్వేచ్ఛనూ, ఆస్తినీ ఒకే మోతాదులో ఒక్క కలం పోటుతో పాలకులు జప్తు చేస్తున్నార''ని చమత్కరించింది. ఆ ఆత్మాభిమానమే స్వాతంత్ర్య సమర జ్వాలలను దావానలంగామార్చి ప్రజలను ఉత్తేజపరచాయి. మళ్ళీ స్వాతంత్ర్యానంతరం అలాంటి ప్రభుత్వ ఉత్తర్వులకు శ్రీ జయప్రకాశ్ కూడా అదే మోతాదులో సమాధానం చెబుతూ వచ్చాడు.

**అధికార వికేంద్రీకరణ**

జయప్రకాశ్ ఆనాడూ ఈనాడూ ఏజైళ్ళలో గడిపినా, ప్రజలలో అతనికిగల అపారమైన విశ్వాసం, వారి శక్తియుక్తుల్లో నమ్మకం ఏనాడూ సడల లేదు. చాలకాలంగా రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉంటూ కేవలం సర్వోదయ వాదిగా గడిపిన జయప్రకాశ్ తిరిగి ఉద్యమ సారధిగా ఈ వయస్సులో ముందుకు రావడానికి ప్రజలతో అతనికి వున్న సాన్నిహిత్యమే కారణం. క్విట్ ఇండియా ఉద్యమంలో సమరశీల సోషలిస్టు శక్తిగావున్న జయప్రకాశ్‌లోని ఈప్రత్యేకతను గమనించిన తరువాతనే గాంధీజీ, దేశంలో అహింసాయుతమయిన పరివర్తనకు తగిన వాతావరణాన్ని సృష్టించడంలో తనకు చేదోడు వాదోడు కావలసిందిగా కోరాడు. ఇంగ్లీష్, ఫ్రెంచి, రష్యన్ విప్లవానుభవాల సారాన్ని ఇతను కొత్త పద్ధతులతో అనువదించాలని ప్రయత్నించాడు. ఇందుకు అతను ఆధారపడుతూ వచ్చింది గాంధేయ సూత్రాలపైన. పాత పద్ధతులలో అధికార వ్యవస్థను తీర్చి దిద్దరాదని కొలది మంది చేతులలో అధికారం కేంద్రీకృతం కారాదని, అంతిమంగా ప్రజల సార్వభౌమాధికారాన్ని, సర్వసత్తాకతను మాత్రమే విశ్వసించాలని నిర్ణయించుకున్నాడు. ప్రజల హక్కులూ, ప్రజాస్వామ్య సంప్రదాయాలూ అప్పుడే బలికి బట్టకట్టగలవని తీర్మానించుకున్నాడు. ఇందుకు ఏకైక రక్షణ ప్రజలను తమ భావికితామే నిర్ణయాధికారులు కాగలిగేటట్టు నిరంతరం చైతన్యవంతులను చేయాలనుకున్నాడు. చైతన్యపు ప్రమిదలలో వత్తులు పెట్టి నూనెపోసే కార్యక్రమాన్ని ఆయన రెండేళ్ళనాడు బీహార్‌లో ప్రారంభించాడు. అవినీతికి నిలయంగావున్న ప్రభుత్వాలు ఎక్కడ ఉంటే అక్కడకు ఉద్యమాన్ని వ్యాప్తి చేశాడు. ఇందుకు వినోబా అడ్డుతగిలినా ఆగలేదు. అవసరమని భావించినప్పుడు భావే సేవక్ సమాజ్‌తో కూడా తెగ తెంపులు చేసుకున్నాడు. సంఘర్ష సమితులు పెట్టాడు. ఛాత్ర సంఘర్ష సమితి యువకులకు వేదిక కాగా జన సంఘర్ష సమితి వయోజను లందరికి కార్యాచరణ వేదికగా

మారింది. ఇది కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాధికారాన్ని ప్రశ్నించినట్టే అయింది. జయప్రకాశ్‌తో ఇందిరకు అంతవరకూ లేని ఘర్షణకు బీహార్ ఉద్యమం నాందిపలికింది. కేవలం సర్వోదయవాదిగా వున్నంత కాలం జె.పి.ని అహింసావాదిగా పరగణించినవారే బీహార్ ఉద్యమం క్రమంగా ఢిల్లీకి వ్యాపించడంతో అతన్ని ''హింసావాది'' అన్నారు; మరికొందరు ఆయన ఉద్యమాన్ని ''సాంస్కృతిక విప్లవం'' అన్నారు. మహజర్లతో 1975లో ఢిల్లీలో పార్లమెంటు వద్దకు జయప్రకాశ్ సారథ్యం వహించిన బ్రహ్మాండమైన యాత్రను అటు ప్రధానిగాని, ఇటు రాష్ట్రపతిగాని పట్టించుకోలేదు. కాని ప్రభుత్వ శక్తి ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో పక్కదారులు పడుతున్నప్పుడు శాంతియుతమైన పద్ధతులలో తమ నిరసన తెల్పడం ప్రజల కనీసపు హక్కు అని స్పష్టం చేశాడు. ఈప్రజాశక్తి ప్రభుత్వ శక్తికి అనునిత్యమూ అంకుశంగా ఉంటేతప్ప ప్రజాస్వామ్యం బతకదని చెప్పాడు.

### ముభావం తెచ్చే ముప్పు

అతనుకోరే ప్రశాంతత వేరు; ''అవును మన సమాజంలో శాంతి లేకపోలేదు. కాని అది సజీవమయిన శాంతి కాదు. పరిణామాల పట్ల ప్రజలు తరచుగా తమకు పట్టనట్లు కూర్చుంటున్నారు. కాని పరిణామాలు ముంచుకు వచ్చి నప్పుడు గగ్గోలు పెడుతున్నారు. ఈ పరిస్థితులు కొనసాగితే అవి మనలను ఎక్కడికి తీసుకుపోతాయి? ఈ ముభావ పరిస్థితికి ముందుగా బలి అయ్యేది ప్రజాస్వామ్యమే. ఏ విలువలకూ రక్షణ వుండదు; ప్రతి విలువా కుప్పకూలి పోతుంది'' అంటాడు.

నిష్కళంక సమరయోధుడూ, ప్రజాస్వామ్యవాదీ, సాత్త్విక విప్లవవాదీ అయిన జయప్రకాశ్ వ్యక్తిత్వాన్నీ, దేశానికి ఆయన ఇంతవరకూ అంద జేసిన సేవలను కేవలం కడచిన రెండేళ్ళ అనుభవం దృష్టానే అంచనా వేయలేం. అలాగే ఆయన దేశ భక్తిని నేటి జనతా పార్టీ వ్యవస్థాపనకే పరిమితమూ చేయలేమూ. జయప్రకాశ్‌ను జైలులో కొన్నాళ్లు బంధించినంత మాత్రాన, అనేక జాతీయ సమస్యలపై ఆయన సలహా సహకారాలనూ దౌత్య సేవలనూ అందుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆ సేవలను మరవవచ్చునేమోగాని, దేశం విస్మరించలేదు. కాశ్మీర్ సమస్యపై పెక్కుసార్లు నెహ్రూ తరపున ఇందిర ప్రభుత్వం తరపునా షేక్ అబ్దుల్లాతో రాజీ బేరాలు సాగించినవాడు జె.పి; ఇండియా - పాకిస్తాన్‌ల మధ్య ఈ సమస్యలను సామరస్యంగా పరిష్కరించడానికి, దేశంలో ఈ సమస్యపై మితిమీరిన జాతీయ దురహంకార ధోరణులను అదుపు చేయడానికి ఆయన ఎంతో కృషి చేశారు. నాగాలాండ్ సమస్య పరిష్కారం సందర్భంగా అజ్ఞాత నాగాలకూ కేంద్ర ప్రభుత్వానికీ సంధాన కర్తగా పని చేశాడు. అంతకంటే గొప్పసేవ, అతనికి ప్రాణహాని కలిగించగల ప్రమాదం ఉన్న సన్నివేశం చంబల్ లోయలో జరిగింది. దశాబ్దాలుగా ప్రభుత్వాన్ని వేధిస్తున్న చంబల్ లోయ బందిపోటు దొంగలకు బోధలు చేసి ప్రభుత్వానికి లొంగిపోయేటట్టూ, లొంగిన తరవాత వారి సాధారణ జీవనానికి ప్రభుత్వం హామీ పడేటట్లు చేసిన మహనీయుడు జయప్రకాశ్. సైనిక శక్తి వల్ల కాని పనిని నైతిక శక్తి వల్ల సాధించిన ఘనత గాంధీజీ తర్వాత మన దేశంలో ఒక్క జయప్రకాశ్‌కు మాత్రమే దక్కింది. అతని జీవితంలో ఈఘట్టం అరేబియన్‌నైట్స్ కథలకు మించిన వాస్తవగాథ.

అంతేగాదు, సాధారణ జీవితంలో ఎక్కడ ఏమూల ప్రజల ప్రాథమిక హక్కులకు ప్రమాదం వాటిల్లినా రెక్కలు కట్టుకుని వాలినవ్యక్తి జె.పి. విచారణ జరపకుండా శిక్షలు విధించడాన్నీ, పౌరులను అక్రమంగా బంధించడాన్ని ఏవగించుకునే మనస్తత్వంగల జె.పి.ని కొందరు ''అభివృద్ధి నిరోధకుడనీ'' మరికొందరు సి.ఐ.ఎ. ఏజెంటుగానూ చిత్రించబూనడం హాస్యాస్పదం. అతని ఉద్దేశంలో ''ప్రభుత్వాలు అనేవి తాత్కాలికాలు, తెరపై బొమ్మలు. కాని ప్రజలు మాత్రం చిరంజీవులు''. అధికారం కోసం రాజకీయాలంటే అతనికి ఏవగింపు. ప్రధానమయిన సామాజిక, ఆర్థిక మార్పులు ప్రభుత్వమూ దాని యంత్రాంగమూ లేకుండా సాధ్యపడవని మనం విశ్వసిస్తాం. కాని అతని దృష్టిలో నైతిక, ధార్మిక విలువల ద్వారానే ఈ మార్పు సాధ్యం. బహుశా ఈఅవగాహనవల్లనే అతను రాజకీయ పక్షాలకు దూరంగా ఉండి ఉంటాడు. అయితే రాజకీయాలకు మాత్రం దూరంగా లేడు. కనకనే అతనికి ఒక నమ్మకం ఉంది. నాయకులు నావికుల లాంటివారు. చుక్కానిని గమ్యం తెలియని వారికి అప్పగించకూడదు. జాతి జీవితంలో ఎదురయ్యే క్లిష్ట సమయాలలో సాహసించి ప్రజాభిప్రాయాన్ని మలపాలిగాని, భీతిల్లిపోయి తప్పుతోవ తొక్క రాదు. అలా భీతిల్లడం నాయకత్వ బలహీనత అంటాడు.

నిస్వార్థ జీవిగా ఇంతటి నైతిక బలం, మనోదార్ఢ్యం ఉన్న వ్యక్తి కాబట్టే జయప్రకాశ్ నూరేళ్ళ చరిత్రగల కాంగ్రెసును పల్టీకొట్టించి, ఆరవ లోకసభ ఎన్నికలలో కేంద్రంలోమూడు శతాబ్దాల కాంగ్రెసు పాలనకు దేవిడీమన్నా చెప్పించడంలో ఘనతరపాత్ర వహించగలిగాడు. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం అంటే ఏమిటో అతని మాటలలోనే విందాం.

''స్వాతంత్ర్యం అన్నది అన్ని వర్గాల ప్రజలకు సంబంధించిన నిర్దిష్టమయిన శక్తి, ప్రజా బాహుళ్యం మాత్రం స్వాతంత్ర్యం అంటే అర్థం అసెంబ్లీలూ, రాజ్యాంగాలు అని భావించజాలరు. వారికి స్వాతంత్ర్యమంటే నిత్య జీవితంలో నిర్దిష్ట ప్రయోజనాలు సమకూర్చి పెట్టేదని అర్థం. భూస్వామ్య విధానం వల్ల కునారిల్లి పోయిన పేద రైతుకు స్వాతంత్ర్యమంటే అర్థం భూస్వామ్య వ్యవస్థ నుంచి తాను విముక్తి పొందడమనే. అంతేగాని భూస్వామ్య వ్యవస్థ రద్దు కావడమూ, స్వాతంత్ర్యమూ పరస్పరం సంబంధంలేనివని కాదు. ప్రజల ప్రాథమిక అవసరాలను స్వాతంత్ర్యం అన్న పదం సక్రమంగా నిర్వచించినప్పుడే వారికి అది నిజమయిన స్వాతంత్ర్యం కాగల్గుతుంది. ప్రజా బాహుళ్యం దృష్టిలో సోషలిజం అన్నది - దారిద్ర్యం, దోపిడీ తొలగిపోయినప్పుడే అనుభవంలోకి వచ్చే వాస్తవం ప్రజలకు సంబంధించినంత వరకూ తాము అనునిత్యం ఏ దోపిడీవల్ల ఏ నిర్బంధంవల్ల బాధపడుతున్నారో దానిని ఎదిరించాలన్న కోరిక వారిలో ఉంటుంది. వారి దృష్టిలో నిత్య జీవన పోరాటమూ స్వాతంత్ర్య సమరమూ ఒకటిగానే ఉంటాయి. ఒక పరిణామం మరొక పరిణామానికి దారితీస్తుంది.''

*(1977 మార్చి 27, ఈనాడు సౌజన్యంతో)*

*(1977 మార్చిలో ప్రచురించి, భద్రంగా దాచి ఇప్పుడు మాకు అందించిన తెనాలి జర్నలిస్టు శ్రీ సూర్యదేవర హనుమంతరావుగారికి కృతజ్ఞతలు)*

# ఆదర్శ నైతిక రాజకీయ జ్యోతి జె.పి.

- శివలింగం

1979 అక్టోబరు 8 మంగళవారం ఉదయం మన జీవితం నుండి ఒక వెలుగు వెళ్ళి పోయినరోజు. భారతీయుల హృదయాల్లో అంధకారం అలుముకున్నరోజు. గాంధీ మరణించినప్పుడు విభేదాలున్నా కలిసి పనిచేసే జాతీయ నాయకులున్నారు. నూతన దేశ నిర్మాణానికి కృషి చేశారు. విభేదాలు విస్మరించారు. దేశ భవిష్యత్తును దృష్టిలో వుంచుకున్నారు. నెహ్రూ, సర్దార్ పటేల్‌లను చూడక పోయినా వారంటే ప్రజల్లో గౌరవం వుంది. అటువంటి వారిప్పుడు లేరు. జయప్రకాష్ నారాయణ మరణించి శూన్యాన్ని మిగిల్చాడు. దేశ భద్రత పట్ల భయంవుండేది కాదు. మహాత్మాగాంధీ భావాలతో ఉత్తేజితులైనవారే. గాంధీలో వున్న నియబద్ధత, సత్యశీలత, ఆచరణాత్మకత చాలా మందిలో లేవు. అయినా నాగరీక ప్రవర్తన హద్దులుదాటలేదు.

జయప్రకాష్ నారాయణ పోరాటంతో అధికారంలోకి వచ్చిన జనతాపార్టీలో ఆయన లక్షణాలు పుణికి పుచ్చుకున్నవారు బహుకొద్ది. స్వార్థం, ద్వేషం, అత్యాశ, అధికారం కట్ట బెట్టిన ప్రజకు ద్రోహం చేయటం వంటి దుర్లక్షణ నేరాలు కలవారు అధికం. జెపి కలలు కన్న ఆదర్శ సమాజం అబద్ధమై పోయింది. అత్యాయిక పరిస్థితికి ముందున్న స్థితి నుండి పురోగమింప చేయడానికి బదులు వెనక్కు మళ్ళించారు. ప్రభుత్వ నైతికాధికాదికతను భ్రష్టపరిచారు. రాజకీయాలను నీచ దుర్మార్గ స్థాయికి దిగజార్చారు. ఇందిరాగాంధీ వారి అనుయాయులకు దేశాన్ని దత్తంచేసి ప్రజలకు ప్రజాస్వామ్యానికి తీరని నమ్మక ద్రోహం చేశారు. గాంధీ, పటేల్, నెహ్రూల నుండి దేశ నిర్మాణ శాస్త్రం గాని కళగాని కాంగ్రెసు వారు నేర్చుకోలేక పోయారు. జెపిని అంగీకరించ లేదు ఎందుకంటే నెహ్రూ పట్ల దురుసుగా వ్యతిరేకించేవాడు. ఇందిరాగాంధీ అనుయాయులు కూడా జెపిని విమర్శించి ఆమెను భూస్వామ్యయుగంలో ఆస్థాన వందిమాగధ స్తోత్రాలు వల్లించిన విధంగా స్తుతించారు. భక్తి ప్రపత్తులతో మెలిగారు. కాంగ్రెసు పార్టీని స్వంతపార్టీగా మార్చుకుంది ఇందిర. జెపికి ఒక వర్గం నైతిక సమర్థతను యివ్వలేక పోయారు. వెన్నెముకలేనివారుగా ఉండిపోయారు. జె.పి. స్థానాన్ని స్వీకరించేవారు లేరు. ఇన్ని సంవత్సరాలైనా స్వాతంత్ర్యం పొందినా, చేదు అనుభవాలు చవి చూచినా ప్రజాస్వామ్యానికీ బానిసత్వానికీ వున్న భేదాన్ని గుర్తించే విచక్షణా జ్ఞానం ప్రజలకు కలగలేదు. సమానత్వాన్ని, స్వాతంత్ర్యాన్ని కోరుకున్నాడు. దేశాన్ని ప్రేమించాడు.

ఆయన మరణానికి కొంత ఇందిరాగాంధీ బాధ్యురాలంటారు. ఒంటరి జైలు నిర్బంధం కారణం. ప్రిజన్ డైరీలో 28 సెప్టెంబరు 1975లో రోగం ఆరంభంగా గుర్తించారు. గాంధీ చంపబడ్డాడు. జెపిని మరొక విధంగా చంపారు. జె.పి. ప్రతిపాదించిన పార్టీరహిత ప్రజాస్వామ్యం ఒక అందమైన స్వాప్నికాదర్శం. సంపూర్ణ విప్లవ ధ్యేయం అదే. యతి ధర్మం అంటున్నారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలు లేకుండా అధికారవాంఛ లేకుండా; ప్రజా ప్రయోజనాలకోసం ప్రజలను పోరాటానికి సిద్ధం చేయడం. సత్యాగ్రహస్థాయిలో నిర్మాణాత్మక సమాజ సేవాకేంద్రాలు నిర్వహించడం వంటి పనులు రాజకీయ యతులు చేయాలి. ప్రజా జీవితాన్ని బలోపేతం చేయడం. సేవ, త్యాగం, సత్యాగ్రహం ద్వారా జీవితాన్ని పరిశుద్ధం చేయడం యతుల పని. పార్టీ రహిత ప్రజాస్వామ్య పార్టీ

---

శివలింగం, చల్లపల్లి.

వీరిది. నేటి సమాజంలో ఆచరణ సాధ్యంకానిది. గాంధీ ప్రథమ స్వాతంత్ర్య నిర్మాత. ద్వితీయ స్వాతంత్ర్య నిర్మాత జె.పి.

స్వాతంత్ర్య సమరయోధుడు, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ వ్యవస్థాపక కార్యదర్శి, సర్వోదయ నాయకుడు, సాంస్కృతిక స్వేచ్ఛ సంస్థ వ్యవస్థాపక సభ్యుడు గాంధేయవాది జె.పి. బాంగ్లాదేశ్‌లో యాహ్యాఖాన్ జరిపిన హత్యాకాండను నిరసించి ప్రజాప్రభుత్వాన్ని గుర్తించి దేశ విదేశాల్లో పర్యటించి 1971 మార్చి ఏప్రిల్ నెలల్లో పత్రికా ప్రకటనలు యిచ్చాడు. మే, జూన్ 1971లో కెయిరో, రోమ్, బెల్గ్రేడ్, మాస్కో, హెల్సింకీ, స్టాక్‌హోమ్, బాన్, సింగపూర్, కౌలాలంపూర్, పారిస్, లండన్, వాషింగ్టన్, న్యూయార్కు, ఒట్టావా, వాంకోవర్, టోక్యో, జకర్తాలలో పర్యటించాడు. 1971 జూన్ 29న భారత దేశం తిరిగి వచ్చినపుడు శాంతి సేవా సంస్థ కార్యకలాపాలు వివరించాడు. ప్రజాభిప్రాయాన్ని కూడ గట్టాడు. తరవాత బాంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా అవతరించింది. ఇందిరాగాంధీ ప్రధానిగా వున్నపుడు బాంగ్లా ప్రజల తరపున మన సైన్యం పాకిస్తాన్ నుండి విముక్తి చేసింది.

గాంధీ పీస్ ఫౌండేషనుకు విదేశాలనుంచి నిధులు వస్తున్నాయని, ఆసంస్థకు జె.పి.కి సంబంధాలున్నాయని అంతేగాదు జె.పి.కి సంబంధాలున్న సంస్థలన్నిటిని ఇందిరాగాంధీ ప్రభుత్వం అణచి వేయడానికి ప్రయత్నించింది. గాంధీ పీస్ ఫౌండేషన్ కార్యదర్శి రాధాకృష్ణ అన్ని వివరాలు యివ్వడం జరిగింది. సంస్థ మీదదాడి చేశారు. ఛైర్మన్ ఆర్. ఆర్. దివాకర్ స్టేట్ హోం మినిస్టర్ ఓం మెహతాకు లేఖరాశారు. బీహార్ ఉద్యమం ప్రజల్ని ఉత్తేజితుల్ని చేసింది. జయప్రకాష్ అనారోగ్యంలో వున్నపుడు ప్రధాన మంత్రి జాతీయ నిధినుండి 90 వేలు డయాలసిస్ మిషను కొనుక్కోడానికి పంపింది. జెపి తిరస్కరించారు. 11 జూన్ 1976న బొంబాయి నుండి ప్రధానమంత్రికి లేఖ రాశారు.

శ్రీ రవి శంకర్ మహరాజ్, స్వామి ఆనంద్, శ్రీ కేదార్ నాథ్ జీ, దాదా ధర్మాధికారి వంటి వారివలన మూడు లక్షలు సమకూరాయని వాటితో మిషనుకొని తదితరపరికరాలకు ఒక సంవత్సరానికి సరిపోతాయని రాశారు. మీరు పంపకముందే జయప్రకాష్ హెల్త్ ఫండు కమిటీని మూసి వేశామని, విరాళాలు ఎక్కువగా వచ్చాయని, ఈ పరిస్థితుల్లో మీ డొనేషను అంగీకరించడం భావ్యం కాదని రాశారు. ఆరోగ్యం కోసం ఉదారత చూపినందుకు కృతజ్ఞతలు తెలియ జేశాడు. జీవితంలో అన్నీ ఓటములే ఎదురైనా నిరాశ చెందక ఓరిమితో అధర్మానికి వ్యతిరేకంగా పోరాడిన ధీరుడు.

జె.పి.తో భారత రాజకీయ నైతిక జ్యోతి ఆరిపోయింది.

ఆత్యాయిక పరిస్థితి విధించినపుడు ప్రముఖ హ్యూమనిస్టు, క్వెస్టు పత్రిక సంపాదకుడు ఎబిషాకు ప్రిజన్ డైరీ యిచ్చి చిన్న పిల్ల వాడిలా తప్పులు దిద్దమన్నాడట. రహస్యంగా దాన్ని టైపుచేసి ప్రచురించి అభిమానులకు యిచ్చి ఫండు వసూలు చేశారు. మిమ్మల్ని ప్రభుత్వం జైల్లో పెడుతుందేమోనంటే జె.పి.లా జైల్లోవుండి పుస్తకం రాసుకుంటానన్నాడు షా. కాంగ్రెస్ ఫర్ కల్చరల్ ఫ్రీడం తరపున ప్రచురిస్తున్న పత్రిక క్వెస్టును షాకు అప్పగించాడు. మేధావుల పత్రికగా తీర్చిదిద్దాడు షా. విభిన్నాభిప్రాయాలకు స్థానం యిచ్చింది. ఎమర్జెన్సీలో నిషేధానికి గురి అయింది.

# జె.పి.

# జీవిత లక్ష్యం

జీవితం నిండా అపజయాలే
విజయాలు నన్ను వరించినపుడు
నేను ప్రక్కకు తప్పుకున్నాను
తెలివితక్కువ వాడ్నా - కాదు

జయానికి అపజయానికీ
నాకున్న నిర్వచనాలు వేరు

చరిత్ర పుటల్ని విప్పి చూడండి
నేనేనాడో ప్రధాని కాగలిగేవాడ్ని

కానీ, విప్లవవాది ఎన్నుకునే మార్గం అదికాదు,
త్యాగం, సేవ, పునర్నిర్మాణం
సంఘర్షణ, సంపూర్ణ విప్లవం

అవే నా తృష్ణను తీర్చేవి
నాగమ్యం బహుదూరం కావచ్చు
ఎన్నెన్నో మెట్లు ఎక్కాల్సిరావచ్చు

అది ఎంత కఠినమైనా
ఆ మార్గం నుండి విశ్రమించేది లేదు

కోర్కెలా - నాకంటూ ఏమీలేవు
నా జీవితం భగవదార్పితం

అందుకే అపజయాలూ నాకు సంతోషాలే
అయితే యువత నా భావాలతో శృతి కలుపుతోంది

ఆ యువత మార్గంలో ముళ్ళు తొలగాలి
ఆటంకాలను ఎదుర్కొని నిలవాలి యువత
అప్పుడే నా జీవితం సఫలీకృతం అయినట్లు

- ఈ గీతం జె.పి. హృదయ సంగీతం
జైలు గోడలమధ్య (9-9-75) తన జీవితాన్ని నెమరు
వేసుకొంటూ వ్రాసుకున్న గీతమిది.

(జె.పి. ప్రిజన్‌డైరీ నుండి)

# వ్లాదిస్లా స్టానిస్లా రేమాంట్ విమర్శనావ్యాసం

*(1924వ సంవత్సరపు నోబెల్ సాహిత్య పురస్కారోపన్యాసము)*

మూలం: రేమాంట్ అనువాదం: బి.వి. రామిరెడ్డి

**పెర్ హోల్స్ట్రామ్, స్వీడిష్ అకాడమీ శాశ్వత కార్యదర్శి**

పోలిష్ భాషకు చెందిన ఈ ఊహాత్మక రచన, 'ది పెజంట్స్' యొక్క ప్రారంభం ఫ్రాన్సుకు చెందిన సహజాత్మక నవలలోను, దానిని ప్రారంభించిన రచయిత 'జోలా' రచనల్లోనూ వుంది. తన రచనకు స్ఫూర్తి! 'లాటెర్రె' అనీ, ఆ రచన రేకెత్తించిన విముఖతేననీ రేమాంట్ చెప్పుకున్నాడు. ఆ రచనలో అతడు సంప్రదాయీకరించబడిన, ముక్కలైన, మృతక పాత్ర చిత్రణ గావించబడ్డ, తాను ప్రేమించిన ఒక సాంఘిక తరగతిని, తన బాల్య స్మృతులతో పెరిగిన సాంఘిక తరగతిని అతడు కనుగొన్నాడు. జోలాలాకాక, ఆ సాంఘిక తరగతిని తన అపారమైన అనుభవంతో, అవగాహనతో, ప్రణాళికా బద్ధంగా, దాని సహజలక్షణాలతో, సిద్ధాంతాలకతీతంగా వర్ణించాడు. ఈ రచన మీద జోలా ప్రభావం తప్పకుండా ఉంది. 1904 - 9 సంవత్సరాల మధ్య రచించిన 'దిపెజంట్స్'లో రేమాంట్ జోలానించి ఏం నేర్చుకున్నాడో, మానవ స్వభావపు బాహ్యలక్షణాలతో కలిపి ఎలా వ్యక్తీకరించాడో మనకు తెలుస్తుంది. అయితే ఈ నవల ఒక సహజాత్మక నవలగా కాక ఒక క్లాసిక్ గా రూపు దిద్దుకుంది.

ఆధునికులమైన మనం దీర్ఘకవితా కావ్యాన్ని క్లాసిక్‌గా భావిస్తాం. అందులో సమతౌల్యం, సంఘర్షణతో కూడిన వ్యధ లాంటివి ఉండాలని భావిస్తాం ఇలాంటివాటిని ఒక విధానపు మూసలో వ్యక్తీకరించడం అంత తేలికైన పనికాదు. అశాంతి, సంఘర్షణ అనేవి తమలో తాము సంఘర్షించుకునే అలల్లాగ చివరికి కవితాకాశపు అంచుల్లో లీనమైపోతాయి. ఈ అశాంతి ఆసరిహద్దు దాటి ఎలాంటి ప్రశ్నలను, శబ్దాలను సృజించలేదు. మనం చూస్తున్న ప్రపంచం స్థిరమైనది, నిజమైనది. అది బలవంతపు జైలుకాదు. అది మానవులు తమ తమ వ్యక్తిత్వాల శక్తిని బట్టి తమ సాధనల్ని కొనసాగించుకునేందుకు అనువుగా సువిశాలమైనది. అందుకే కవితలో సమ్మేళనా తౌల్యం. సంతోషాన్ని లిఖించినా, పరిష్కరించలేని బాధ, నిజానికీ ఆదర్శానికీ మధ్య ఉన్న భేదం అక్కడ మనకు కనిపించదు. అది అంతరాత్మలోకి చేరదు. అంతర్గతంగా మనిషిని ముక్కలుగా చేసే విషాదం ఇంకా సృజించబడలేదు. మనం చూస్తున్న ఆకారాలు సమగ్రమూ, సామాన్యమూను. అవి గొప్పవైనా, సామాన్యమైనా, అందమైనవైనా వికారమైనవైనా, ఒకరకమైన ప్లాస్టిక్ సౌందర్యాన్నీ, కళాత్మక రూపాన్నీ ధరిస్తాయి.

'ది పెజంట్స్' నవలలో ఈ పోలిష్ రచయిత ఆ గమ్యాన్ని తన ఆధునిక శిక్షణతో సాధించాడు. అతను ఎంచుకున్న విషయం అతడు ఈ గమ్యాన్ని చేరుకునేందుకు దోహదపడింది. అతడు ఈ రూపాన్ని తనకు తెలసిన విధానాన్ని అనుసరించాడు. అతని ఆ కృషే ఈ గొప్ప పురస్కారానికి అర్హమయింది.

అతని పోలిష్ దేశపు రైతులు వారి పురాతన పరిస్థితుల్లో, వారి సామాన్య స్వరూప స్వభావాలతో ఒక విధమైన కళాత్మకతను కలిగివున్నారు. వారిలో చాలామందికి ప్రత్యేకమైన వ్యక్తిత్వ లక్షణాలు లేవు. వారి పురుషత్వంలో అంతర్ క్రమశిక్షణ, బాధ్యత, నిజాయితీలతో కూడిన సామూహిక

---

బి.వి. రామిరెడ్డి, సిద్ధార్థా ఆర్ట్స్ & సైన్స్ కళాశాలలో ఆంగ్లోపన్యాసకులుగా పనిచేస్తున్నారు, విజయవాడ.

అనుభూతి కనిపిస్తుంది. అందువల్ల స్త్రీ పాత్రల నించి ఎక్కువ ఆశించనవసరం లేదు. ఆమెలో ఒక స్థిరమైన విధి నిర్వహణా భావన కనిపిస్తుంది.

తుఫాను లాంటి కోరిక మనుషుల నిర్ణయాలను కదిలించి లొంగదీసుకుంటుంది. నిజాయితీకి స్థిరత్వం లేదు. కారణము అది ఎదగడానికి స్వేచ్ఛ లేక పోవడమే. అనంతకాలంనించీ ప్రజలు తమ నిజాయితీని ఎన్నో వొత్తిళ్ళనించి కాపాడుకోవలసి వస్తున్నది. అలాంటి పరిస్థితుల నుండి ఉద్భవించిన వినాశనం, తటస్థత లాంటి వాటికి భాషలోను, జీవితంలోను శక్తిలేదు. ఇలాంటి వొత్తిళ్ళు వారి ఆత్మ విశ్వాసాన్ని నాశనం చేయలేక పోయాయి. ఆ ఆత్మాభిమానం దౌర్బల్యంలో కలిసి తన సమతౌల్యాన్ని పోగొట్టుకోవడం వల్ల మానవగౌరవానికి తగిన నమ్మకమైన ఆసరా నివ్వలేకపోయింది. వారివి పిల్లల్లా వేళ్ళూనని మంచి లక్షణాలు. వాటిలో ఆకర్షణ, గొప్పదనం ఉంది. మొత్తం మీద ఈ ప్రజలు వారి గట్టి ఊహాత్మక జీవితంతో మనల్ని ఆకట్టుకుంటారు. వారి పేదరికంలో చంచలత్వంలో ఒకరకమైన కలల ప్రపంచం కనిపిస్తుంది. దాని కొక సౌకుమార్యం, మంచితనం, అందం ఉంది.

చర్చి వారికోసం ఈ కాందిశీకుల నగరాన్ని తయారు చేసింది. దానితో వారికి బలమైన ప్రేమ, గౌరవ బంధాలేర్పడ్డాయి. అప్రయత్నంగా రచయిత గొప్ప క్లాసిక్‌కి అవసరమైన వెలుగును కనుగొన్నాడు. వారిలో నాయకత్వానికి, భూమాతతో ఏకమైన ప్రాచీనమైన, లోతైన బంధం ఉంది. వారికి జీవితాన్నిచ్చేదీ తీసుకునేదీ అదే. వారి ప్రేమలో ప్రకృతి శక్తులకు సంబంధించిన గొప్పదనం ఉంది. వసంతం, గ్రీష్మం, శిశిరం, హేమంతం లాంటి రుతువులు తమ ప్రభావంతో మానవ జీవితానికొక లయను ప్రసాదిస్తాయి. రుతు చక్రం జీవితపు పరిధిని నియంత్రిస్తుంది. ఈ విషయం మన ఊహలో పదే పదే దర్శనమిస్తుంది. సంఘటనలు ఒక్కసారిగా సంభవించవు. వాటికొక ప్రత్యేకత ఉంది. అవి కోరికతో, ఊహతో, విషాదంతో, ఆనందంతో కూడినవైనా, వాటికొక లయ ఉంది. వాటిలో మట్టికి సంబంధించిన యౌవనం ఉంది.

అయితే ఈ నవల వర్ణనాభేదం వల్ల అక్కడక్కడ విసుగు కలిగిస్తుంది. అయినా మనం దాన్ని లెక్క చేయం. శైలి, పాత్ర చిత్రణ, సంతోషంతో కలిసి పాఠక హృదయాన్ని ఆకట్టుకుంటాయి. ఇందులోని 'జగ్నా' ఒక ప్రధాన స్త్రీ పాత్ర. ఈ పాత్ర తప్ప మిగిలిన నవలంతా వాస్తవ చిత్రమేనన్న భావన కలిగిస్తుంది. ఈ పాత్ర పోలిష్ కవితాత్మకీ, పోలిష్ వ్యవసాయ స్త్రీకీ ప్రతీక. సహజత్వం, ఊహాత్మకత, సౌందర్యతృష్ణ, బాధ్యతా రాహిత్యం లాంటివి కొన్ని సందర్భాలలో చెల్లాచెదరౌతుంటాయి. రేమాంట్ తన ప్రజల ద్వారా ప్రతి బింబించిన తప్పులన్నిటికీ ఆమె ప్రతినిధి. మానవ స్వభావానికి సంబంధించిన అన్ని గొప్ప లక్షణాలనీ ఆమె ప్రతి బింబిస్తుంది. రచయిత ఆమెను తన కావ్యపు విషాదనాయకగా రూపొందించాడు. అతడు ఎలాంటి పాఠాలనూ బోధించడు.

సంక్షిప్తంగా చెప్పాలంటే ఈ నవలలో గొప్ప కళాత్మకత, శక్తి ఉన్నాయి. అవే ఈ నవలకు కేవలం పోలిష్ భాషలోనే గాక, మొత్తం ఊహాత్మక సాహిత్యంలోనే ఒక విలువను, ఔన్నత్యాన్ని సాధించిపెట్టాయి.

**స్వీయచరిత్ర**

నేను 1868 మే 6న రష్యా ఆధీనంలో ఉన్న కొబీలో విక్‌గ్రామంలో జన్మించాను. నా తండ్రి ఆ గ్రామంలోని చర్చిలో సంగీత వాద్యకారుడు. నా మేనమామ ఆగ్రామానికి క్యురేట్. పిజార్ సాధువు. ఆయన బాగా చదువుకున్నవాడు. ఎప్పుడూ ఏకాంతాన్ని ప్రేమించేవాడు. మాది కాథలిక్కు

కుటుంబం. వ్యవసాయదారులుగా మేము చాలా కఠినమైన జీవితాన్ని గడిపాము. 1863 లో రష్యాకి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో మా కుటుంబం ప్రధాన పాత్ర పోషించింది. మా కుటుంబ సభ్యులు కొంతమంది చంపబడ్డారు. నా మేనమామల్ని సైబీరియాకి పంపించారు. నా తల్లి వార్తాహరిగా తనవంతు బాధ్యతను నిర్వహించింది. బాల్యంలో నాకు పెద్ద జబ్బు చేసింది. నా ఆరోగ్యం ఎప్పుడూ అంతంత మాత్రమే. నేను సంవత్సరం వయసులో ఉండగా మా మామయ్యను 'టిస్జిన్' అనే చోటికి బదిలీ చేశారు. అది గొప్ప పారిశ్రామికవాడ అయిన 'లోడి'కి చాలా దగ్గర. అక్కడ మా నాన్న కొన్ని ఎకరాల భూమిని కొని తన సంగీత వృత్తిని మాని వేశాడు. మా ఆస్తుల్ని మా అమ్మే చూసుకునేది.

నేను ఆరేళ్ళవయసులో పోలిష్ భాషను చదువను, వ్రాయను నేర్చుకున్నాను. నామేనమామ లాటిన్ భాషను నేర్పాడు. ఆ పాఠాలు బోరు కొట్టేవి. ఆ రోజుల్లోనే చర్చి లైబ్రరీలో మంచి పుస్తకాల్ని చూశాను. ఆ లైబ్రరీలోని గొప్ప గ్రంథాలన్నింటినీ చదవడం ప్రారంభించాను. చదవడం నాకు వ్యసనమై పోయింది. చొక్కా చాటున పుస్తకాల్ని పట్టుకుపోయి, వీలుదొరికి నప్పుడల్లా చదువుతూ ఉండేవాణ్ణి. ఆ శిశిరం అంతా లాటిన్ పుస్తకాలు చదివాను. నాకు మా నాన్న గారి గొర్రెల్ని చూసుకోవడం తప్పనిసరి అయింది. అప్పుడే మత యుద్ధాల్ని గురించి, వాల్టర్ స్కాట్ నవలల్ని చదివాను.

నేను మా పెద్దన్నయ్య సాయంతో కాలేజీలో చేరేందుకు ప్రయత్నించాను. దురదృష్టవశాత్తు మా మామయ్య చనిపోయారు. సరైన ఆదాయం లేక మా నాన్నగారు నాకు ఉన్నత విద్య చెప్పించలేక పోయారు. నన్ను తనలాగ వాయిద్య కారుణ్ణి చేసేందుకు ప్రయత్నించారు. పియానో నేర్పించేందుకు ప్రయత్నించారు. బెత్తం దెబ్బలతో, త్వరగానే నేర్చుకున్నప్పటికీ, అదంటే నాకు విసుగెత్తింది. సంగీత విద్యతో బాటు, చర్చిలో బాప్టిజం, వివాహము, జనన మరణాల రికార్డులు, చర్చి కార్య క్రమాలలో మా నాన్నగారికి సాయపడుతుండేవాణ్ణి. నా మిగిలిన సమయాన్ని గురించి ఎవరూ పట్టించుకోక పోవడం వల్ల, నాకు ఈ పనులు ఇష్టంగానే ఉండేవి. నా మిగిలిన సమయాన్నంతా పఠనానికి వినియోగించే వాణ్ణి. తొమ్మిదేళ్ళ వయసు వచ్చే సరికి, నేను, సమకాలీన పోలిష్ సాహిత్యమూ, ఇతర సాహిత్యాలలో సంపూర్ణ జ్ఞానాన్ని సంపాయించాను. ఒక ముప్పై ఏళ్ల వయసున్న స్త్రీ మీది అభిమానంతో, ఆరాధనతో కవితలు వ్రాయడం ప్రారంభించాను. ఆవిడకి మాత్రం వీటి గురించి తెలియదు.

ఈకాలంలోనే మా అన్నయ్య కాలేజీని వొదిలి, నేను పద్ధతి ప్రకారం సాహిత్యాన్ని పఠించేందుకు సహాయ పడ్డాడు. నాకోసం అతనెంతో శ్రమ పడ్డాడు. కాని, కవిత్వాన్ని నా హృదయం నుండి విడదీయలేక పోయాడు. ఆరోజుల్లో నేను మా సాహిత్యంలోని రొమాంటిక్ కవుల కవిత్వం మత్తులో పడ్డాను. నేను పఠించిన కవిత్వం ప్రభావంతో ప్రపంచాన్ని నా వ్యక్తిగత ఇష్టాయిష్టాలతో విభజించుకున్నాను. నాలో ఏదో అర్థంకాని తపన, అశాంతి, అర్థంకాని కోరికలు తలెత్తాయి. పగటి కలలు కంటూ ఉండేవాణ్ణి. ఊహలరెక్కలు విప్పుకుని, అర్థంకాని ప్రపంచాలకు ఎగిరి పోతూ ఉండేవాణ్ణి. అప్పటికే ఇంటికి హత్తుకుపోయిన రోజువారీ జీవితం బరువుగా తోచింది. ధీరవంతమైన పనులు చెయ్యాలనీ, సముద్రయాన సాహసాలు చేయాలనీ, స్వేచ్ఛా జీవితం గడపాలనీ కలలుగనేవాణ్ణి, వారాల తరబడి ఇల్లు వొదిలి, అడవుల్లో అడవి మనిషిలా బ్రతకాలని అనుకునే వాణ్ణి. నా నోటు

పుస్తకాలను అర్థంకాని గీతల ఆకారాలతో నింపేవాణ్ణి. అనేక రాత్రులు కారణ రహితంగా, దుఃఖిస్తూ గడిపేవాణ్ణి. పన్నెండేళ్ళ వయసు దాకా నా జీవితం అలానే గడిచింది.

ఇరవై యేళ్ల వయసు వచ్చాక వార్సాలో నివసించాను. సుకుమార హృదయుణ్ణి కావడాన సహజంగానే విచ్చలవిడి ఊహా ప్రపంచంలో విహరించాను. బాధ నన్ను వీడని సహచరి అయింది. నేను సోషలిస్టు నయినందుకు తగిన శిక్ష పడింది. రష్యన్ అధికార్లు నన్ను అనుమానించి లోడిలో సంభవించిన సమ్మెలో నా పాత్ర ఉన్నదని భావించి, నా గురించి జాగ్రత్త తీసుకోమని మా నాన్నగారికి, లోకల్ పోలీసులకు అప్పగించారు. ఆ రోజుల్లో నా తల్లి దండ్రులకు ఒక నీటి మర ఉండేది. నేను మా నాన్న గారి క్రూరత్వం, రోమన్ కాథలిక్ మతం యొక్క నియంతృత్వాలను భరించలేక పోయాను. కొన్ని వారాల తరువాత కొందరు నటులతో కలిసి ఇల్లు విడిచి పారిపోయి, దేశమంతా తిరిగాను. ఒక సంవత్సరం సంచారంలో సంచార కళాకారుల జీవితాల్లోని బాధల్ని అర్థం చేసుకున్నాను. నటుడిగా బ్రతకడానికి నాలో ప్రత్యేకతలు లేక పోవడం వల్లా, భవిష్యత్తు మీది భయం వల్లా ఆ ప్రయాణాల్ని మానుకున్నాను.

రైల్వే ఎలక్ట్రికల్ సర్వీసులో చిన్న ఉద్యోగం సంపాయించాను. రెండు స్టేషన్ల మధ్య ఒక రైతు ఇంటిలో ఉండేవాణ్ణి. నా ఆదాయం దయనీయం. జీవితం కష్టాలతో బరువుగా ఉండేది. నాకు ఆధ్యాత్మికతను అవలంబిస్తున్న ఒక జర్మన్ ప్రొఫెసర్‌తో పరిచయం అయింది. అతడు నన్ను జయించాడు. నా కనుల ముందు ఒక ఆశల కలల ప్రపంచం వెల్లివిరిసింది. ఉద్యోగాన్ని వొదిలేసి ఆ ఆచార్యుడితో జెస్టోచోవాలో నివసించడం ప్రారంభించాను. ఆయనకు ఇంగ్లండు జర్మనీ దేశాల్లోని ఆధ్యాత్మిక వాదులతో స్థిరమైన సంబంధాలుండేవి. మేడం బ్లావట్స్కీ, ఒల్కావ్ తో కలిసి ఆధ్యాత్మిక పత్రికలకు వ్రాస్తుండేవాడు. అతనికి ఆధ్యాత్మికవాదం ఒక శాస్త్రం, ఒక మతం. అతని ఇంటిలో ఆధ్యాత్మిక వాతావరణం ఆవరించి ఉండేది. అతనిది చిన్న పిల్లల మనస్తత్వం. దయార్ద్ర హృదయుడు. ఎప్పుడూ మోసగించబడుతూ ఉండేవాడు. అతని తంత్రాలలో నమ్మకం పోవడంతో అతన్ని వొందిలేశాను. చేతిలో పైసా లేకుండా ప్రపంచంలో పడ్డాను. కొంతకాలం ఒక సర్వేయరు దగ్గర, షాపులో గుమస్తాగా పని చేశాను. చివరికి మళ్ళీ నాటకశాలలో చేరాను. ఒక నాటక కంపెనీలో నటుడిగా గ్రామాల్లో ప్రదర్శనలిస్తూ తిరిగాను. ఆ కంపెనీ దివాళా తీయడంతో మళ్ళీ రొడ్డున పడ్డాను. చాలా పద్యాలు నోటికి రావడంతో అమెచూర్ నాటకశాలల్లో ప్రాడ్యూసరుగా పనిచేశాను. ప్రాంతీయ పత్రికలకు వ్రాశాను. ఈ వృత్తులన్నీ అసహ్యాన్ని కలిగించాయి. మళ్లీ పూర్వపు రైల్వే ఉద్యోగంలో చేరాను.

కొద్ది కాలం ప్రశాంతంగా జీవించాను. నేను చేయగల ప్రత్యేక కార్యక్రమాలేవీ కనబడలేదు. చాలినంత స్వేచ్ఛా సమయం అందుబాటులోకి వచ్చింది. టీ, రొట్టె, కలలతో బ్రతక సాగాను. నాకు ఇరవై రెండేళ్ల వయసు వచ్చింది. నా ఆరోగ్యం బాగుంది. నాకు ఒక పాత సూటు, చిల్లులు పడ్డ బూట్లు మాత్రమే ఉన్నాయి. నా మనసులో ఎన్నో ప్రణాళికలున్నాయి. ప్రపంచంమీద నమ్మకం ఉంది. పది అంకాల నాటకాల్ని, నవలల్ని, కథల్ని, సంకలనాలకొద్దీ కవితల్ని వ్రాయడం ప్రారంభించాను. వాటినన్నింటినీ నిర్దాక్షిణ్యంగా చించి తగులబెట్టాను. నాకు మిత్రులు లేరు. ఏకాంత జీవితాన్ని గడపసాగాను. నన్ను అందరూ వొదిలేశారు. నా చుట్టూ మనుషుల తత్వాలతో రాజీపడలేక పోయాను. ఇవన్నీ భరించడం కష్టంగా ఉండేది. దైన్యం నన్ను వొదల్లేదు. కార్మికుల్ని పరిశీలిస్తూ రోజులు గడిపేవాణ్ణి. నా గదిలో భయంకరమైన చలిరాత్రుల్ని గడిపాను.

రెండేళ్ళ పాటు ఈ హింసలన్నిటినీ అనుభవించాను. ఆరు మంచి కథల్ని రచించాను. వాటిని వార్సాలోకి 'క్రిటిక్' పంపించాను. ఆరునెలలకుగాని వాటిని ప్రచురణకు స్వీకరిస్తున్నట్టు వార్త రాలేదు. ఆ పబ్లిషరు నన్ను వేరే పబ్లిషర్లకు సిఫారసు చేశాడు. నా కథలు ప్రచురింపబడ్డాయి. నా హృదయం సంతోషంతో నిండి పోయింది. నాకొక దారి దొరికింది. నా యజమానులకు కూలి వాళ్లు కావాలి గాని రచయితలు కారు. అందుచేత నన్ను పని నుండి తొలగించాడు.

నా వ్రాత ప్రతులు, మూడు రూబుళ్ళ యాభై కోపెక్కులతో ప్రపంచాన్ని జయించేందుకు వార్సా వెళ్ళి పోయాను. కొత్త ఇబ్బందులతో నా జీవన యానాన్ని ప్రారంభించాను. నాకు ఎవరి సహాయమూ లభించలేదు. నా కుటుంబంతో సంబంధాలు తెగిపోయాయి. వాళ్ళు నన్ను అర్థం చేసుకోలేదు. ఆరు నెలలు రుచికరమైన భోజనం అంటే ఏమిటో ఎరుగను. వెన్నెల రాత్రుల్లో బయటికి వెళ్ళేవాణ్ణి. చిరిగిన బట్టలే ధరించే వాణ్ణి. నేనుండే చోటుకు ఎదురుగా ఉన్న చర్చిలో కూర్చుని వ్రాసుకునే వాణ్ణి. సంగీత వాయిద్యంతో మత సంబంధమైన ఉత్సవాల్లో పాల్గొనేవాణ్ణి. ఆత్మహత్య చేసుకోవాలని తీవ్రంగా ప్రయత్నించాను. మృత్యు భయం నన్ను ముందే చంపివేసింది. ఆకలి, చనిపోవాలనే కోరిక నా నమ్మకాన్ని పెంచాయి.

ఏప్రిల్ నెల వసంతంలో జెస్టోచోవాకి యాత్రికులు వెళ్ళడం చూసి, వారిలో చేరిపోయాను. ఆ యాత్రను గురించి నేను వ్రాసిన పర్యాటకానుభవాలకు ఒక పత్రిక 25 రూబుళ్ళు పంపించింది. పదకొండు రోజుల పాటు ఆ అందమైన వసంతంలో పయనించాను. (Pilgrimage to the Mountain of Light - 1895) వార్సా సచిత్ర వారపత్రికలో అది ప్రచురింపబడి విమర్శకుల దృష్టిని ఆకర్షించింది. కొన్ని నెలల తరువాత 1896లో 'ది కమేడియన్' వ్రాశాను. ఆ రోజుల్లోనే ఒక ఆధ్యాత్మిక సంఘంతో పరిచయం ఏర్పడింది. వారిలో డా॥ అభోరోవిజ్ ఉన్నారు. థియోసాఫికల్ సొసైటీ లోని సమస్యలను తెలుసుకునేందుకు లండన్ వెళ్ళాను. తిరిగి వొచ్చాక 1897లో 'ఫెర్మెంట్స్' (Ferments) వ్రాశాను. ఆ తరువాత భారీ పరిశ్రమల స్థితిగతుల్ని అధ్యయనం చేసేందుకు లోడ్ వెళ్లాను. 1899లో 'The Promised Land' వ్రాశాను. పారిస్ వెళ్ళాను. చాలా నెలలు ఫ్రెంచి గ్రామాలలో గడిపాను. 'Lili' అనే చిన్న కథలు వ్రాశాను. ఇటలీలో పర్యటించాను. 1902 లో వార్సా దగ్గర జరిగిన ఒక రైలు ప్రమాదంలో గాయపడ్డాను. ఆ తరువాత నాకు పూర్తి ఆరోగ్యం చేకూరలేదు.

1903 - 4 సంవత్సరాల మధ్య 'ది పెజెంట్స్' మొదటి కాపీ వ్రాసి తగులబెట్టాను. ఈసారి 1904-9 సంవత్సరాల మధ్య దాన్ని నాలుగు భాగాలుగా వ్రాశాను. 1911లో 'ది వాంపైర్' వ్రాశాను. దీనిలో నా ఆధ్యాత్మికానుభవాలను వ్రాశాను. రెండు నవలికలు వ్రాశాను. 17వ శతాబ్దానికి పతనమైన పోలెండు చరిత్ర పఠనాన్ని ప్రారంభించాను. 1913 - 18 సంవత్సరాల మధ్య 'The Year' 1794 వ్రాశాను. దీని చివరి భాగం 'Isurrection' ని వార్సాను జర్మనీ ఆక్రమించిన యుద్ధ సమయంలో వ్రాశాను. మరొక నవలికల సంకలనాన్ని కూడా ప్రచురించాను. ఏప్రిల్ 1919లో నా దేశస్థుల్ని కలుసుకునేందుకు అమెరికా వెళ్ళాను. 1922 - 23 ల మధ్య 'Defiance' వ్రాశాను. అప్పుడే నాకు గుండె జబ్బు ప్రారంభమైంది. నేనింకా చాలా విషయాలు చెప్పాలి, వ్రాయాలి అనుకుంటున్నాను. కానీ, మృత్యువు - నన్ను ఆ పని చేయనిస్తుందా?

రేమాంట్ (1868-1925) 1925లో నోబెల్ బహుమతి అందుకున్నాక చనిపోయాడు. అతని రచనలన్నీ 1930-32ల మధ్య వార్సాలోనూ, అతని సెలెక్టెడ్ వర్క్సు 1951లో పన్నెండు సంకలనాలుగాను ప్రచురింప బడ్డాయి.

# మనిషిపై అల్యూమినియం దాడి

- సి.వి. సర్వేశ్వరశర్మ

గత అర్ధ శతాబ్దికాలంలో ప్రపంచవ్యాప్తంగా జరిగిన పారిశ్రామికీకరణ ఫలితంగా మానవ జీవితాలు ఊహించని విధంగా కాలుష్యాన్ని ఎదుర్కోవలసి వచ్చింది. భోపాల్లో విషవాయువు ఎంతో మంది జనాన్ని తుడిచి పెట్టేసిన సంగతి మనకు తెలుసు. ఇటువంటి సంఘటనలు ప్రపంచ వ్యాప్తంగా జరుగుతూనే ఉన్నాయి.

ఇటీవల కాలంలో పశ్చిమదేశాల్లోను, ఇండియాలో కూడా అల్యూమినియంపై చర్చలు మొదలయ్యాయి. అల్యూమినియం లోహాన్ని పరిశ్రమల లోనే కాదు, ఇళ్ళల్లోకూడా పాత్రలుగా భారీగా ఉపయోగిస్తున్నారు. ఈ అల్యూమినియం కారణంగా మెదడు విష ప్రభావానికి లోనయి మనిషి అనేక దుష్ఫలితాలు పొందుతున్నట్లు కనుగొన్నారు.

విషప్రభావం చూపే మూలకాలయిన ఆర్సెనిక్, కాడ్మియం, సీసం, పాదరసం, నికెల్ వంటి వాటి సరసన అల్యూమినియం లేదు. ఈ విష ప్రభావం గల మూలకాలు ప్రోటీనులలోని సల్ఫైడ్రల్ గ్రూపుతో బంధం వేసుకుని జీవరసాయన చర్యలకు అడ్డు వస్తాయి. అల్యూమినియంకు ఇటువంటి లక్షణము లేదు.

భూమి ఉపరితలంలో కావలసినంత అల్యూమినియం అల్యూమినోసిలికేట్ల రూపంలో ఉంది. మొక్కలు భూమి నుండి దీనిని వేళ్ల ద్వారా పీల్చుకుంటూ హైడ్రోజన్ అయాన్‌లను విడుదల చేస్తాయి. దీని వల్ల నేలకు ఆమ్ల తత్త్వం బాగా పెరుగుతుంది. టీ మొక్కలు వంటివి వాటి కాండములు, ఆకుల్లోను బాగాహెచ్చు గాఢతల్లో అల్యూమినియంను నిల్వ చేసుకోగల్గుతాయి. ఈ అల్యూమినియం విష ప్రభావం వల్ల పశ్చిమ జర్మనీలోని అడవులలోని ఎన్నో చెట్లు నాశనం అయిపోయాయని పరిశోధకులు అభిప్రాయ పడుతున్నారు.

అల్యూమినియం ప్రభావానికి ఇతర జీవాలు కూడా దెబ్బతింటున్నాయి. నీటికి అల్యూమినియం కలిపితే ఆల్గే పెరుగుదల తగ్గిపోతోంది. చేపలు ఈ అల్యూమినియం ప్రభావానికి సూటిగా గురవుతున్నాయి. ఆమ్ల వర్షాల కారణంగా ఈ మూలకం నేలగుండా లోపలకు పోయి భూగర్భజలాల్లో ఇరుక్కుంటోంది. సరస్సులు, తటాకాలలో అల్యూమినియం స్థాయి అధికమవుతోంది. ఫలితంగా చేపలు ప్రభావితం అవుతున్నాయి.

**మనిషిపై ప్రభావం**

మొక్కలు, జంతువులలో ఈ అల్యూమినియం పేరుకు పోయిన స్థాయి పైనే కాకుండా తన చర్యల వల్ల కూడా అల్యూమినియం ప్రభావానికి మనిషి గురవుతున్నాడు. మొక్కలు, జంతువులు

సి. వి. సర్వేశ్వరశర్మ, అమలాపురం, శ్రీ కోనసీమ భానోజీ రామర్స్ కళాశాలలో భౌతిక విజ్ఞాన శాస్త్ర శాఖలో రీడర్‌గా పనిచేసి రిటైర్ అయినారు.

మనిషికి ఆహార వనరులు. గత అర్థ శతాబ్దికాలం నుండి అల్యూమినియంను మనిషి భారీగా ఉపయోగిస్తున్నాడు.

ఔషధాలుగా యాంటాసిడ్స్, యాస్ప్రిన్‌ల రూపంలో సేవించినపుడు వాటి తయారీలో ఉపయోగించిన అల్యూమినియంను తన శరీరంలోకి ప్రవేశపెట్టుకుంటున్నాడు. అనుదినం ఈ మూలకాన్ని 5 నుండి 50 మిల్లీ గ్రాములను మనిషి తీసుకుంటున్నాడని ఒక అంచనా. అయితే ఇదంతా దాదాపు పూర్తిగా మలముద్వారా విసర్జించబడుతుంది.

మనిషి వయసు పెరుగుతూంటే అతి స్వల్పంగా ఈ అల్యూమినియం కణాల్లో నిల్వ ఉంటుంది. వయసు ముధిరి ముసలి తనం వచ్చే కొలది వీటినిల్వలు కణాల్లో పెరుగుతాయి. శరీరంలో మొత్తం 60 మిల్లీ గ్రాముల ఆల్యూమినియం ఉంటుందని అందులో మూడోవంతు 'లివర్'లో ఉంటుందని ఒక అంచనా.

ఎముకల్లో ఈ అల్యూమినియం పేరుకుపోవడం, ముసలితనం వచ్చేకొద్ది ఈ అల్యూమినియం నిల్వలో మెదడు, ఊపిరితిత్తులు, మూత్ర పిండాలలో పేరుకుపోవడం జరుగుతుందని తెలుసుకున్నారు. ఫలితంగా మనిషి శారీరకంగా మానసికంగా ఊహించని ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోంది.

### అల్జీమర్స్ వ్యాధి

యాభయి, అరవైసంవత్సరాలు వయసు వచ్చిన వారికి ఆల్జీమర్స్ వ్యాధి వస్తుంది. 1907లో జర్మనీకి చెందిన నరాల వైద్యుడు అలాయిస ఆల్జీమర్ ఈ వ్యాధి లక్షణాలను గుర్తించాడు. అందుబాటులో ఉన్న గణాంక వివరాలను బట్టి అమెరికాలో సాలీనా ఒకటిన్నర నుండి రెండు మిలియన్ల మందికి ఈ వ్యాధి సోకుతోంది వారిలో పదివేలమంది మరణిస్తున్నారట.

ఆల్జీమర్స్ వ్యాధి లక్షణాలు తెలుసుకోవాలి. ఖచ్చితంగా ఆలోచించ లేక పోవడం, చిన్న చిన్న లెఖ్ఖలు చేయడంలో తప్పడం, అనుదినం ఎదురయ్యే సమస్యలను పరిష్కరించ లేక పోడం, మరిచి పోవడం వంటి లక్షణాలు ఈ వ్యాధికి ఉంటాయి.

ఈ వ్యాధి కారణంగా క్రమక్రమంగా మనిషి ఇతర వ్యక్తులను, కాలాన్ని చివరకు ప్రదేశాన్ని కూడా పట్టించుకోవడం మానేస్తాడు. ఈ వ్యాధికి కారణం మెదడు సంకోచించి, అందులోని అరలు ఉబ్బి, కణాల సంఖ్య తగ్గిపోవడం. ఇంతవరకూ ఈ జబ్బుకి చికిత్స ఖచ్చితంగా ఫలానా అని చెప్పలేక పోతున్నారు.

ఈ వ్యాధి రావడానికి గల కారణాలపై శాస్త్ర వేత్తలకు ఏకాభిప్రాయం లేదు. ఎందుకు ఈ వ్యాధి వస్తోంది? అనే అంశంపై మాత్రం పరిశోధనలు చేస్తున్నారు.

1970వ సంవత్సరంలో తొలిసారిగా ఈ వ్యాధిగ్రస్తుల మెదడులో అల్యూమినియం హెచ్చుగా ఉన్నట్లు గుర్తించారు. దానితో మెదడులో హెచ్చుస్థాయిలో అల్యూమినియం నిల్వ ఉండడం ఈ వ్యాధికి కారణమా? అనే ప్రశ్న ఎదురయ్యింది.

మానవ జీవితంలో అల్యూమినియం ప్రధానమయిన భూమిక వహిస్తుంది. మన భూమి మీద సర్వ సాధారణంగా లభించే మూలకాలలో మూడవది ఇది. మనిషి శరీరంలో ఇతర ఖనిజాల మాదిరి ఇది కూడా ఉంటోంది. మనిషి శరీరానికి ఈ మూలకం అవసరం అని ఎక్కడా శాస్త్ర విజ్ఞానం చెప్పిన దాఖాలాలు లేవు.

మనం ఆహారం తీసుకునేటప్పుడు అల్యూమినియం కూడా మన శరీరంలో జేరుతుంది. ఈ అల్యూమినియంలో ఎక్కువ భాగం ఎవరో ఎక్కడో మనం సేవించే నీరు, పానీయాలు, మందులు, ఆహారం, కాస్మోటిక్స్‌లలో కలపడం వల్ల మన శరీరంలోజేరుతోంది.

**అల్యూమినియం చౌక**

మన భారత దేశంలో చాలామంది జనం ఆహార పదార్థాలను అల్యూమినియం పాత్రలతో వండుకుంటారు. దానికి ముఖ్య కారణం అల్యూమినియం చౌక, తేలిక - పైగా ఎక్కడ పడితే అక్కడ దుకాణాల్లో దొరుకుతుంది.

అల్యూమినియంలో ఉండే మలినాలవల్ల అది హరించుకుపోతుంది. అంటే పాత్ర తినివేయబడుతుంది. ఈ అల్యూమినియం పాత్రలు తినివేయబడకుండా ఉండేందుకు వాటికి ఆక్సైడు పూతలు పూస్తారు. ఈ పూతల వల్ల పాత్ర తిని వేయబడదు. అవి మంచి నిరోధకాలుగా నిలబడి హరించుకు పోకుండా కాపాడుతాయి. కాలం గడిచే కొలది ఈ పూత రాలిపోతుంది. చివరకు అల్యూమినియం పాత్ర తిని వేయబడుతుంది.

అల్యూమినియం పాత్రలను ఎక్కువకాలం వాడడం, వంటలు చేసేటప్పుడు తరచు హెచ్చు ఉష్ణోగ్రతలకు వేడి చేయడం వంటి పనులవల్ల ఆ పాత్ర త్వరగా హరించుకు పోయే ప్రమాదం ఉంటుంది.

ఈ అల్యూమినియం పాత్రలలో ఆమ్ల స్వభావం గల ఆహార పదార్థాలు వండితే వాటిలోకి అల్యూమినియం చేరే అవకాశం ఉంటుంది. ఆహార పదార్థాలతో శరీరం లోకి చేరిన ఈ అల్యూమినియం శరీరంలోని రసాయన శక్తితో బంధం ఏర్పరుచుకుంటుంది. దానితో శరీర వ్యవస్థకు ఇదొక అడ్డుగా తయారవుతుంది. మనిషికి ఆల్జీమర్స్ వ్యాధి లక్షణాలు మొదలవుతాయి. ప్రస్తుతం ఈ వ్యాధికి కారణం అల్యూమినియం అని చాలామంది పరిశోధకులు అభిప్రాయ పడుతున్నారు.

**నరాల వ్యవస్థకు నష్టం**

మన నరాల వ్యవస్థకు అల్యూమినియం విషంలా పనిచేస్తుంది అంటున్నారు. ఎలుకల మెదళ్లలోకి అల్యూమినియం ఇంజెక్షన్లు ఇస్తే అవి తమ జ్ఞాపక శక్తిని కోల్పోయాయని చెపుతున్నారు ఈ రంగంలో పరిశోధనలు చేస్తున్నవారు.

జపాన్‌లో కొన్ని ప్రాంతాల్లో నివశించే మనుషులకు నరాల వ్యాధులు అధికంగా ఉన్నాయట. కారణాలు అన్వేషిస్తే ఆ ప్రాంతాలలో లభించే మట్టి, నీరులలో హెచ్చు అల్యూమినియం ఉందట. పైగా వారి మెదళ్లల్లో అల్యూమినియం నిల్వలు 'ఆల్జీమర్స్' వ్యాధి సోకిన వారి మెదళ్లల్లో వున్న నిల్వల మాదిరిగా ఉన్నాయట.

ఎన్నిపరిశోధనలు, ఎన్ని సర్వేలు చేసినప్పటికిని అల్యూమినియం కారణంగానే ఈ వ్యాధి వస్తోందని స్పష్టంగా శాస్త్రవేత్తలు ప్రకటించ లేక పోతున్నారు. అయితే అల్యూమినియం మనిషి ఆరోగ్యాన్ని దెబ్బ తీయకుండా ఉండేందుకు అల్యూమినియం పాత్రలతో వంట చేసుకునేవారికి కొన్ని జాగ్రత్తలు తీసుకోమని శాస్త్రవేత్తలు సలహాలు ఇస్తున్నారు.

**జాగ్రత్తలు**

1. వంట పాత్రకు ఆక్సైడు పూత ఉందో లేదో చూసుకోవాలి.
2. అల్యూమినియం వంట పాత్రకు పెద్ద మంట పెట్టకూడదు ఎందుకంటే ఇది మృదులోహం. ఎక్కువ వేడికి అందులో ఉడికే పదార్థాలలోకి అల్యూమినియం చేరుతుంది.
3. ఈ పాత్రలో నీటితో ఉడక బెట్టే వాటి విషయంలో బెడద ఉండదు. కాని వేపుళ్ళ విషయంలో పై నిబంధనలు పాటించాలి.
4. ఈ పాత్రల్లో ఉడికే పదార్థాలు కదిపేందుకు కర్ర గరిటను ఉపయోగించడం మంచిది. లోహపు గరిటను ఉపయోగిస్తే రాపిడికి అల్యూమినియం ఆహారపదార్థాలలో చేరే అవకాశం ఉంటుంది.
5. ఆమ్ల తత్త్వంగల పుల్లని పదార్థాలను ఈ పాత్రలలో వండడం మంచిది కాదు.
6. ఆహారపదార్థాలను ఈ పాత్రలలో వండినా అందులో ఉండగా వాటిలో ఉప్పువేయకూడదు. పదార్థాలను స్టెయిన్ లెస్ స్టీలు పాత్రలోకి మార్చుకుని అప్పుడు ఉప్పు వేయాలి.
7. కాఫీ , టీలను ఎక్కువ కాలం అల్యూమినియం కెటిల్స్‌లో మరగించకూడదు.
8. వండుకున్న ఆహారపదార్థాలు ముఖ్యంగా ఆమ్లతత్త్వం కల్గినవి ఈ అల్యూమినియం పాత్రలతో నిల్వ ఉంచకూడదు.
9. పాతబడిన అల్యూమినియం పాత్రలు, ఆక్సైడు పూత పోయినటువంటి వాటివి వంటలు చేయడానికి వినియోగించకూడదు.

# స్వగతం నుండి స్వగతానికి

- డా॥ యు. ఏ. నరసింహమూర్తి

ప్రతి వ్యక్తి తనలో తాను మాట్లాడుకుంటాడు. తార్కికములైన ఆలోచనలు సాధారణంగా సంభాషణరూపాన్ని పొందుతాయి. గాఢమైన ఉద్వేగాలు ఈ స్థితిని కల్పిస్తాయి. ఇతరులతో ఆలోచనలను పంచుకున్నప్పుడు అవి మాటలుగా వెల్లడవుతాయి. ఇతరులతో పంచుకోలేని ఆలోచనలు స్వగతాలుగా నిలుస్తాయి. ఎంతటి వివేకి అయినా కొన్ని సందర్భాలలో ఒకటి రెండు మాటలైనా తనకు తానే నోటితో వెల్లడించుకుంటాడు. ఎప్పుడోగాని అలా జరగదు. మిగిలిన అన్ని సందర్భాలలోను వ్యక్తి ఆలోచనలు ఆ వ్యక్తిలోనే అణగి ఉంటాయి. ఉన్మాదులు అలా అణచుకోలేరు. తమకు తామే బయటకు మాట్లాడుకుంటారు. అది ఒక మానసిక రుగ్మతగా పరిగణింపబడుతుంది. ఇది లోక ధర్మం. కాని కావ్య ధర్మం అలాంటిది కాదు. కావ్యంలో ఒక వ్యక్తి ఆలోచనలు తమకు తాముగా వెల్లడి కావలసిన సందర్భాలెదురవుతాయి. శ్రవ్య కావ్యంలో ఈ స్థితి ఎక్కువగా ఉంటుంది. దృశ్య కావ్యంలో కూడా పాత్రలు తమకు తామే మాట్లాడుకుంటాయి. ఇది నాట్య ధర్మం. పాత్రలు వెల్లడిస్తేగాని బయటపడే అవకాశంలేని మనోగతాభిప్రాయాలుంటాయి. అటువంటి సందర్భాలలో నాటక కర్తలు 'స్వగతం' లేదా 'ఆత్మగతం' అనే సూచనతో పాత్రముఖంగా ఆయా అభిప్రాయాలను వెల్లడిస్తారు. ప్రాచీన కాలం నుండి ప్రాచ్య పాశ్చాత్య నాటక కారులీ పద్ధతి ననుసరిస్తూ వస్తున్నారు. అయితే స్వగతాన్ని ఉపయోగించడంలో ప్రాచ్య పాశ్చాత్య నాటకకారుల మధ్య కొన్ని తేడాలున్నాయి. అలాగే ప్రాచీన - ఆధునిక నాటక కారుల మధ్య కూడా కొన్ని విభేదాలున్నాయి.

భరతుడు తన నాట్యశాస్త్రంలో ఇరవై రెండవ అధ్యాయంలో చిత్రాభినయాన్ని గూర్చి వివరించాడు.[1] స్వగతము - ఆత్మగతములతో పాటు అపవారితకము (a side) అనే రీతి అభినయం కూడా అందులో చెప్పబడింది. ఒకడే వినేటట్లు మిగిలినవారు వినకుండా ఉండేటట్లు పలికే సంభాషణను అపవారితకము అంటారు. ఒక్కడికి మాత్రమే వినపడకుండా రంగస్థలం మీది మిగిలిన పాత్రలన్నీ వినేలా పలికే సంభాషణలను జనాంతికము అంటారు. సంస్కృత నాటకాలలో కుండలీ కరణాలలో ''అపవార్య'', ''త్రిపతాకాకారం కృత్వా'' అనే సూచనలు చేసి పలికే ఈ రెండు రకాల సంభాషణలకు కూడా జనాంతికమనే వ్యవహారం ఉంది.

కుమారగిరి రెడ్డి వసంత రాజీయమనే అలంకార శాస్త్ర గ్రంథాన్ని రచించాడు. కాటయ వేమారెడ్డి అభిజ్ఞాన శాకుంతలానికి వ్యాఖ్య రాస్తూ కుమారగిరి రెడ్డి ''ఆత్మగతము'' మొదలైన ప్రదర్శన రీతులను గూర్చి ఈ క్రింది విధంగా రాసినట్లు పేర్కొన్నాడు.

''అశ్రావ్యం నియతశ్రావ్య మీషచ్ఛ్రావ్య మితి త్రిధా
అశ్రావ్య మన్యై రజ్ఞాత మాత్మన్యేవ స్థితం విదుః

---

డా॥ యు. ఏ. నరసింహమూర్తి, విజయనగరం, మహారాజా కళాశాలలో తెలుగు శాఖాధ్యక్షునిగా పదవీ విరమణ చేసి, అక్కడే యు.జి.సి. ఎమిరిటస్ రీసెర్చి ఫెలోగా ఉంటున్నారు.

తథాత్మగత మిత్యుక్త్వా నాట్యవ్యంగ్యే నివేశయత్।
అర్థస్త్వేకేన విజ్ఞేయో నియత శ్రావ్య ఇష్యతే॥
ద్వివిధస్స పరిజ్ఞాయో జనాంతో శ్చాపవారితమ్।
గుహ్యో గుహ్యతరశ్చేతి జనాంతో ద్వివిధో మతః।।
స్యాజ్జనాంతిక మిత్యుక్త్వా వాచ్యః పూర్వస్తథా పరః।
కర్ణ ఏవ మిత్యుక్త్వా జ్ఞాప్యః పశ్చాత్సంగతేః॥
సర్వై రాకర్ణనీయార్థః శ్రావ్య ఇత్యభిధేయతే।
ఏతం ప్రకాశ మిత్యుక్త్వా తయోరంతే ప్రయోజయేత్॥[2]

రంగస్థలం మీద వినిపించే సంభాషణ శ్రావ్యము - నియత శ్రావ్యము - ఈషత్ శ్రావ్యము అని మూడు రకాలుగా ఉంటుంది. అశ్రావ్యము ఇతరులకు తెలియదు. తనలోనే ఇమిడి ఉంటుంది. ఇదే 'ఆత్మగతము' అని నాటకాలలో ఉపయోగింపబడుతుంది. ఒకనికే వినిపించే అర్థము (మాట) నియతశ్రావ్యము అనబడుతుంది. అది జనాంతము - అపవారితము అని రెండు రకాలు. గుహ్యము - గుహ్యతరము అని జనాంతము రెండు విధాలు. రంగస్థలం మీద 'జనాంతికము' అని పలికి ఆ సంభాషణలు చెప్పాలి. చెవిలో చెప్తున్నట్లుగా గుహ్యతరమైన సంభాషణను చెప్పాలి. అందరూ వినదగిన సంభాషణను ''శ్రావ్యము'' అంటారు. 'ఆత్మగతము' లేదా 'జనాంతికము' ముగిసిన తర్వాత ''ప్రకాశమే'' అని సూచన చేసి ఆ సంభాషణలను పలకాలి - ఇది కుమారగిరి రెడ్డి వివరణ.


రసార్ణవ సుధాకరమనే తన అలంకార శాస్త్ర గ్రంథంలో సింగభూపాలుడు కూడా ఈ అంశాన్ని కొంచెం వివరించేడు. అసూచ్యము దృశ్యము - శ్రావ్యము అని రెండు విధాలు. శ్రావ్యము స్వగతము - ప్రకాశము అని రెండు విధాలు. అందరికీ వినబడేది సర్వప్రకాశము. రంగస్థలం మీద గల పాత్రలలో ఒక్కరికే వినిపించేది నియత ప్రకాశము. నియత ప్రకాశ మనేది జనాంతము. అపవారితము అని తిరిగి రెండు విధాలుగా ఉంటుంది. నటులు ఒక ముద్రను పట్టి జనాంతిక సూచన చేస్తారు. ఆ ముద్రకు ''త్రిపతాక'' అని పేరు. బొటన వ్రేలు, చిటికెన వ్రేలు కాక మిగిలిన మూడు వ్రేళ్లను నిటారుగా నిలిపిన చేతిని ఇతరులకు అడ్డముగా నిలిపి ఈ సంభాషణలను పలుకుతారు. ఇది సాధారణంగా కథా మధ్యంలో జరుగుతుంది. ఈ విధంగా కాకుండా పక్కకు తిరిగి ఒక్కనితో రహస్యం చెప్పడాన్ని ''అపరివాతము'' అంటారు.[3]

చిత్రాభినయంలో భాగంగా 'ఆకాశభాషితము' అనేరీతి ఒకటి ఉంది. రంగస్థలం మీద నున్న ఒక పాత్ర రగంస్థలం మీద ప్రవేశించకుండా దూరంగా వారితో సంభాషించడాన్ని 'ఆకాశవచనము' అంటారు. సాధారణంగా నాటక వస్తువునకు సంబంధించి బయటనుండి వినవచ్చే ప్రశ్నలకు సమాధాన రూపంలో ఈ సంభాషణ కొనసాగుతుంది. దీనిని ఆశరీర నివేదన, పరోక్షాంతరితములచే నిరూపించాలని అభినవగుప్తుడు వివరించాడు.[4]

సవికల్పము హృదయస్థ విషయము భావస్థ విషయము ఆత్మగత మనిపించుకుంటుందని నాట్య శాస్త్రం చెప్తూంది. అతి హర్షము - మదము - ఉన్మాదము - రాగము - ద్వేషము - భయము - విస్మయము - క్రోధము - దుఃఖము అనెడి భావాలలో ఒక దానితో గాని, అనేకంతోగాని అవశుడైన పురుషుడు తన మనోభావాలను వెల్లడించు కోవడం ''ఆత్మగతం'' అనిపించుకుంటుందని అభినవగుప్తుని వివరణ.

శ్రీ పి.ఎస్. ఆర్. అప్పారావుగారు తమ నాట్యశాస్త్ర అనువాదంలో స్వగతాన్ని గూర్చి ఈక్రింది వివరణ ఇచ్చేరు.[5] ''గ్రీకు నాటక కర్తలు మొదలగువారు స్వగతమును స్వేచ్ఛగా వాడినారు. ఫ్రెంచి రూపక కర్తలు మాత్రము కొందరు స్వగతములకు బదులుగా విదూషకుని వంటి నాయక సహాయులను సృష్టించినారు. స్వగతములో హృదయమందు దాగియుండు ఆంతర భావములు వెల్లడించ బడునట్లే ఈ సహాయక పాత్రలతో ఆంతర భావములు వెల్లడి ఆగుటచే ఫ్రెంచి రూపక కర్తలు నాయక సహాయులను ఉపయోగించిరి. కాని ఈ పాత్రలు కేవలము పేలవముగా నుండుటచే మోలియర్, షేక్స్పియర్ ప్రభృతులు మరల స్వగతములనే వాడియున్నారు''! భారతీయ నాటకకర్తలు స్వగతాలను నిబంధించడంలో అత్యంతమైన నిగ్రహాన్ని ప్రదర్శించారనిపిస్తుంది. పాత్రలు గాఢోద్వేగ భరితములైన పరిస్థితులలో కూడా వారి స్వగతాలు సంక్షిప్తంగా, సూక్ష్మంగా ఉంటాయి. స్వగతాలలోని అసంభావ్యతను నిరోధించడానికి వారు పాశ్చాత్య రూపక కర్తలు స్వగతాన్ని పొదుపుగా వాడుకున్నారు. నాయక సహాయ పాత్రలను స్వగతాలకు ప్రత్యామ్నాయ పాత్రలుగా వాడుకునే ప్రయత్నాన్ని భారతీయ నాటక కర్తలెన్నడూ చేపట్టలేదు. ఆధునిక భారతీయ నాటక కర్తలు మాత్రం స్వగత నిబంధనలలో భారతీయ సాంప్రదాయిక నాట్య కళా ధర్మాని కంటే పాశ్చాత్య నాటక కళారీతికి ఎక్కువ ప్రాముఖ్యాన్ని కల్పించినట్లు కనిపిస్తుంది. అందునా షేక్స్పియరు నాటక కళ వారిని బాగా ప్రభావితం చేసింది. అందుచేత వారి స్వగతాలలో చెప్పుకోదగిన మార్పు కనిపిస్తుంది. సుదీర్ఘ స్వగతాలు, ఆకాశ వచనాలు ఏక పాత్రాభినయాలకు దారితీసాయి. ఫ్రెంచి నాటక కర్తల లాగ 'స్వగతాలకు' ప్రత్యామ్నాయంగా నాయక సహాయ పాత్రలను సృష్టించిన వారూ ఉన్నారు. కన్యాశుల్కంలో గిరీశం స్వగతాలు ఆకర్షణీయంగా ఉంటాయి. వెంకటేశం సహాయంతో గిరీశం కొన్ని స్వగతాలను సంభాషణలుగాను, లఘు - దీర్ఘ ఉపన్యాసాలుగాను మార్చుకున్న సంఘటనలు ఆ నాటకంలో కనిపిస్తాయి. అయితే కన్యాశుల్కంలో విదూషక పాత్రలు లేవు. అందుచేత అందులోని స్వగతాలు గాని, స్వగతాలకు ప్రత్యామ్నాయంగా సంభాషణలు కొనసాగించడానికి ఆలంబనంగా చేసుకున్న సహాయక పాత్రలుగాని ఏ విధంగాను పేలవంగా కనబడవు. భారతీయ పాశ్చాత్య నాటక సంప్రదాయ రీతులను నిశితంగా అధ్యయనం చేసిన నాటక కళామర్మజ్ఞుడిగా గురజాడ ఈ విజయాన్ని సాధించాడు. (సశేషం)

"Published with Financial Assistance from the Central Institute of Indian Languages, (Ministry of Human Resource Development, Dept. of Secondary and Higher Education, Govt. of India) Manasagangotri, Mysore - 570 006 vide sanction Letter No. F. 53-1/2001-2002/LM/GRNT dated 19th March, 2002 under the scheme of Grant-in-Aid L.M."



యువకుడుగా జయప్రకాశ్

MISIMI/మిసిమి RNI Regd. No. 45042/90 Telugu Monthly, Hyderabad-500 020. Postal Regd. No. H/SD/19

